ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలి: ఎస్పీ

కర్నూలు క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు వెరిఫికేషన్ కోసం ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఎస్‌సీటీ సివిల్, ఏపీఎస్పీ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పురుషులు, మహిళా అభ్యర్థులు కర్నూలులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. ఈ నెల 25వ తేదీన సివిల్ కానిస్టేబుల్ అభ్యర్థులు, 26న ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల అభ్యర్థులు హాజరు కావాలన్నారు.

బరాబార్ వేయం



వ్యూహాత్మక బార్ పాలసీని ప్రభుత్వం తెరపైకి తెచ్చింది. కొత్త పాలసీలో ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ పద్ధతి అని ప్రకటించడంతో యాజమాన్యాలు జీర్ణించుకోలేక పోతున్నాయి. జిల్లాలోని బార్ల నిర్వాహకులు సిండికేట్‌గా మారి బార్లకు దరఖాస్తులు వేయకూడదనే నిర్ణయానికి వచ్చారు. బార్ పాలసీలో లైసెన్సు దారులు నష్టపోయే నిర్ణయాలు ఉన్నాయంటూ గుసగుసలాడుకుంటున్నారు. గతంలో జిల్లాలో 27 బార్లు ఉండేవి. ప్రస్తుతం 26 బార్లకు కుదించారు. అందులో మూడు గీత కులాలకు మంజూరు చేశారు. మిగిలిన 23బార్లలో అన్నివర్గాల వారు దరఖాస్తు చేసుకునేలా విధి విధానాలు ఖరారు చేశారు. ఎక్సైజ్ శాఖ ముమ్మర ప్రచారం చేస్తున్నా నేటికీ ఒక్క దరఖాస్తు కూడా రాలేదు.

- నాలుగు దరఖాస్తుల విధానంపై విముఖత
- బార్ పాలసీతో సతమతం
- ఎక్సైజ్ శాఖ ముమ్మర ప్రచారం
- నేటికీ అందని ఒక్క దరఖాస్తు

కర్నూలు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ మద్యం దుకాణాలకు పర్మిట్ రూమ్‌లు ప్రకటించాక బార్లకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. బార్ల యాజమాన్యాలు కోర్టును ఆశ్రయించే పరిస్థితి కూడా లేకుండాపోయింది. ఈక్రమంలో బార్ల నుంచి వ్యతిరేకత ఎదురైనప్పటికీ ఫీజును కాస్త తగ్గిస్తూ లాటరీ పద్ధతిని తెరపైకి తెచ్చింది. ప్రభుత్వం ఏమైనా ఊరటనిచ్చే దిశగా మరో నిర్ణయం తీసుకుంటుందా అనే కోణంలో బార్ల యాజమాన్యాలు ఎదురు చూస్తున్నాయి.. ఫలితంగా దరఖాస్తులు వేసేందుకు ఆసక్తి చూపడం లేదు. పాత బార్ల యాజమాన్యాలే తప్పనిసరిగా దరఖాస్తులు వేస్తారనే ధీమాలో ఎక్సైజ్ శాఖ ఉంది. కొత్త పాలసీలో ఒక్కో బార్‌కు నాలుగు దరఖాస్తులు ఉంటేనే లాటరీ పద్ధతి అని ప్రకటించడంతో యాజమాన్యాలు జీర్ణించుకోలేకపోతున్నాయి. ఒక్కో దరఖాస్తు రుసుం గతంలో రూ.7.50లక్షలు ఉండేది. ఈసారి రూ.5లక్షలకు తగ్గించింది.



ఒక్క దరఖాస్తు రాని వైనం..

ఈనెల 18న నోటిఫికేషన్‌జారీ చేసినప్పటికీ ఒక్క దరఖాస్తు కూడా రాక పోవడంతో అమావాస్య సాకు చూపి ఎక్సైజ్ శాఖ దాట వేస్తోంది. జిల్లాలోని బార్ల యాజమాన్యాలు సిండికేట్ దిశగా బార్లకు దరఖాస్తులు వేయకూడదనే నిర్ణయానికి కొందరు వచ్చారు. ప్రతి ఏటా లైసెన్స్‌లు దక్కించుకోవడానికి బార్ల యాజమానులంతా ఒక్కటయ్యే వారు. బార్ పాలసీలో లైసెన్సుదారులు నష్టపోయే నిర్ణయాలు ఉన్నాయంటూ నిర్వాహకులు గుసగుసలాడుకుంటున్నారు. గడిచిన మూడేళ్ల పాటు బార్లు నిర్వహించిన బార్ లైసెన్సు దారులంతా ఇప్పుడు దరఖాస్తులు వేయడానికి విముఖత చూపుతున్నారు.

ఈనెల 26 లోపు దరఖాస్తులు

ఈనెల 26 లోపు దరఖాస్తులు సమర్పించాలి. జిల్లాలో 27 బార్లు ఉండేవి. ప్రస్తుతం 26 బార్లకు కుదించారు. మూడు గీత కులాలకు మంజూరు చేశారు. మిగిలిన 23 బార్లలో అన్నివర్గాల వారు దరఖాస్తు చేసుకునేలా విధివిధానాలు ఖరారు చేశారు. ఏళ్ల తరబడి బార్ల నిర్వహణలో ప్రమేయం ఉన్నవారే దరఖాస్తులు చేస్తున్నారు. కొత్తవారు ఆసక్తి చూపడం లేదు. ప్రతి ఏటా సిండికేట్ అయి ముందుగానే బార్లు మాట్లాడుకునే వారు. వైసీపీ హయాంలోనూ ఇదే జరిగింది. అప్పట్లో వైసీపీ నాయకులు పెత్తనం చలాయించారు. జిల్లాలోని కర్నూలు, ఆదోని, ఎమ్మిగనూరు వంటి పట్టణాల్లో ముడుపులు చెల్లించి మరీ బార్లు దక్కించుకున్నారు. ఈసారి జిల్లాలోని అన్నిబార్లలోనూ దరఖాస్తులు వేయకూడదని అంతా ఏకమయ్యారు. ఈనెల 26 లోగా దరఖాస్తులు సమర్పించాలి. ఇప్పటిదాకా ఒక్క దరఖాస్తు కూడా అందలేదు.

ఐవీఆర్ పద్ధతిలో ఫోన్‌కాల్స్

కొత్త బార్ లైసెన్సు విధానంపై ఎక్సైజ్ శాఖ ముమ్మర ప్రచారం చేస్తోంది. పట్టణాల్లో ఏర్పాటుచేసే బార్లకు దరఖాస్తు చేసుకోవాలంటూ ఐవీఆర్(ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్) పద్ధతిలో ఫోన్‌కాల్స్ చేస్తున్నారు. మహిళలకు ఇటువంటి కాల్స్ వెళ్తున్నాయి. ఈనెల 18న నోటిఫికేషన్ జారీ చేశారు. ఇప్పటివరకు జిల్లాలో ఒక్క బార్‌కు కూడా దరఖాస్తు నమోదు కాలేదు. ప్రస్తుతానికి దరఖాస్తు సమర్పించకూడదంటూ జిల్లా బార్ అసోసియేషన్ ఒక నిర్ణయానికి వచ్చింది. ఇప్పటిదాకా ఒక్క దరఖాస్తు రాకపోవడంపై అధికారుల్లోనూ చర్చ సాగుతోంది.

నిబంధనల్లో స్వల్ప మార్పులు



ప్రభుత్వ నిబంధనల్లో తాజాగా శుక్రవారం రాత్రి స్వల్ప మార్పులు చోటు చేసుకున్నాయి. నిజానికి గతంలో ప్రతి బార్‌కు నాలుగు దరఖాస్తులు వస్తే మాత్రమే ఆయా బార్లకు లక్కీ డిప్ తీసి ఎంపిక చేయాలని నిబంధన విధించారు. ఇక బార్లకు దరఖాస్తులు నాలుగు కంటే తక్కువ వస్తే మాత్రం ఆయా బార్లకు వచ్చిన దరఖాస్తులు రద్దు చేసి మరోమారు టెండర్లు పిలిచేలా నిర్ణయించారు. అయితే తాజాగా ప్రభుత్వం బార్లకు చెల్లించే నాన్ రిఫండ్‌బుల్ అమౌంట్ విషయంలో వ్యాపారులకు అనుకూలంగా ఓ అడుగు ముందుకేసింది. తక్కువ దరఖాస్తులు వస్తే ఆయా బార్ల దరఖాస్తులను రద్దు చేసి రిఫండ్‌బుల్ అమౌంట్‌ను (మొదట చెల్లించే రూ.5లక్షలు) వెనక్కి ఇచ్చే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆసక్తి కలిగిన బార్ల వ్యాపారులకు ఈ నిర్ణయం కలిసి రానుంది. ఈ క్రమంలో శనివారం నుంచి బార్ల కోసం దరఖాస్తులు పెరిగే అవకాశం ఉందని ఎక్సైజ్ శాఖ భావిస్తోంది.

'స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర'ను విజయవంతంగా నిర్వహించాలి

- ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాలు సక్రమంగా జరగాలి
- కలెక్టర్ రంజిత్ బాషా



కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లా అంతటా స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర, ఉపాధి హామీ తదితర అంశాలపై డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మాన్‌సూన్ హైజీన్ అనే థీమ్‌తో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా అంతటా ర్యాలీలు, అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మెరుగైన సేవలు అందిస్తున్న వారికి తగిన గుర్తింపును ఇచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం వచ్చే అక్టోబరు 2వ తేదీ గాంధీ జయంతి రోజు అవార్డులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కుటుంబానికి సగటున ఉపాధి కల్పనలో, వంద పనిదినాల కల్పనలో పురోగతి తీసుకుని రావాలన్నారు. 8,500 పంట కుంటలకు గానూ 3,497 పూర్తయ్యాయని, మిగతా వాటిని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వామిత్వ కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న గ్రౌండ్ ట్రూతింగ్ పనులను వారం రోజుల్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జడ్పీ సీఈవో నాసరరెడ్డి, డ్వామా పీడీ వెంకటరమణయ్య, డీపీవో భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలి

- 'డయల్ యువర్ ఎస్‌ఈ'లో ఉమాపతి



సమస్యలు తెలుసుకుంటున్న ఉమాపతి

కల్లూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని కర్నూలు విద్యుత్ శాఖ ఎస్‌ఈ ఎం.ఉమాపతి సిబ్బందికి సూచించారు. 'డయల్ యువర్ ఎస్‌ఈ'లో భాగంగా శుక్రవారం ఆయన ప్రజలు, వినియోగదారుల నుంచి సమస్యలు విన్నారు. స్తంభాలు-2, డీటీఆర్-1, సప్లై ఫెయిల్యూర్-1, లోఓల్టేజీ-2, విద్యుత్ సరఫరాలో అంతరాయం-4, నూతన సర్వీసులు-1, అగ్రికల్చర్ సర్వీసు-1, ఆరు ఇతర సమస్యలపై జిల్లాలో మొత్తం 18 మంది తమ సమస్యలపై ఎస్‌ఈకి విన్నవించుకున్నారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా విధుల్లో పాల్గొన్నాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పనిచేసే ప్రాంతాల్లోనే అధికారులు నివాసం ఉండాలన్నారు. విద్యుత్ సేవలకు ఎవరికీ ఎలాంటి నగదు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. 'డయల్ యువర్ ఎస్‌ఈ'లో వచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏడీఈ విజయభాస్కర్ పాల్గొన్నారు.

సుంకేసులకు 1.40 లక్షల క్యూసెక్కుల వరద

- ఉధృతంగా ప్రవహిస్తున్న తుంగభద్ర
- శ్రీశైలానికి కొనసాగుతున్న 4,70,039 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో


నిండుకుండలా దర్శనమిస్తున్న సుంకేసుల జలాశయం

కర్నూలు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): తుంగభద్రకు వరద ప్రవాహం కొనసాగుతోంది. కర్నూలు నగరానికి ఆనుకొని 1,35,402 క్యూసెక్కుల ప్రవాహంతో జల ప్రేమికులను తుంగభద్ర కనువిందు చేస్తోంది. సుంకేసుల బ్యారేజీకి శుక్రవారం 1.40 లక్షల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. 1.20 టీఎంసీలకు మించి అదనంగా నిల్వ చేసుకునే సామర్థ్యం లేదు. దీంతో జలాశయం భద్రత దృష్ట్యా వచ్చిన వరదను వచ్చినట్లుగా దిగవన శ్రీశైలానికి వదిలేస్తున్నారు. 20 గేట్లెత్తి 1,35,402 క్యూసెక్కుల మేర వరదను నదికి విడుదల చేయగా, 2,375 క్యూసెక్కులు కేసీ కాలువకు వదులుతున్నారు. 290.20 మీటర్ల లెవల్‌లో 0.608 టీఎంసీలు మాత్రమే నిల్వ చేశారు. రాయలసీమ జీవనాడి తుంగభద్ర డ్యాంకు 80,500 క్యూసెక్కుల వరద కొనసాగుతోంది. గరిష్ఠ నీటి మట్టం 1,633 అడుగులు, పూర్తిస్థాయి సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, 1,624.54 అడుగుల లెవల్‌లో 74.96 టీఎంసీలు నిల్వ చేశారు. 85,351 క్యూసెక్కులు నదికి, 9,200 క్యూసెక్కులు వివిధ కాలువలకు విడుదల చేస్తున్నారు.

శ్రీశైలానికి పోటెత్తిన వరద

తెలుగు రాష్ట్రాల ప్రాణనాడి శ్రీశైలం జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఎగునవ సుంకేసుల బ్యారేజీ (తుంగభద్ర), జూరాల ప్రాజెక్టు (కృష్ణా నది) గేట్లు దాటి 4,73,039 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. స్పిల్‌వే 10 క్రస్ట్‌గేట్ల 18 మీటర్లు పైకెత్తి 4,21,530 క్యూసెక్కులు, ఏపీ, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు ద్వారా 64,953 క్యూసెక్కులు కలిపి 5,20,111 క్యూసెక్కులు దిగువ నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ఏపీ ప్రభుత్వం పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేలు తీసుకోగా, మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా హంద్రీనీవా కాలువకు 2,818 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా 800 క్యూసెక్కులు ఎత్తిపోస్తున్నారు.

బిల్లుల కోసం ఎదురుచూపులు

- ముందుకు సాగని అభివృద్ధి పనులు
- నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ అయితేనే..
- పెండింగ్‌లో 90 బిల్లులు
- ఇబ్బందుల్లో కాంట్రాక్టర్లు
- మామూళ్ల మత్తులో అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. నగర పాలక సంస్థ పరిధిలో కూటమి ప్రభుత్వం వచ్చాక 160 అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు రూ.40కోట్లు పెండింగ్‌లో ఉండటంతో వారు తల్లడిల్లుతున్నారు. బిల్లులు రాకపోవడంతో కొన్నిచోట్ల పనులు నిలిచిపోయాయి. నగరంలో జరుగుతున్న కోట్లాది పనులకు గతంలో 60 మంది కాంట్రాక్టర్లు పనిచేసేవారు. బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం కేవలం 15మాత్రమే పనిచేస్తున్నారు. ఒక్కొక్క కాంట్రాక్టరుకు రూ.60 లక్షల నుంచి రూ.2కోట్ల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.



కూటమి ప్రభుత్వం నిధి పోర్టల్‌ను..

కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బిల్లుల కోసం కాంట్రాక్టర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేసేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం వచ్చాక నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం నిధి పోర్టల్‌ను ప్రారంభించే ముందు బిల్లులు త్వరితగతిన అప్‌లోడ్ అవడంతో పాటు డబ్బులు కూడా కాంట్రాక్టర్ల ఖాతాలో జమ అవుతాయని చెప్పారు. ఇప్పటివరకు నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులు మంజూరు కాలేదు.

- జగన్నాథగట్టు వద్ద నిర్మిస్తున్న ట్రిపుల్ ఐటీ భవనానికి నీటి సరఫరా కోసం రూ.8 కోట్లు మంజూరు చేశారు. పనులు ప్రారంభం అయ్యాయి. కేవలం రూ.3కోట్లు మాత్రమే నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. మిగిలిన రూ.5 కోట్లు ఇంకా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయలేదు.
- నగరపాలక కార్యాలయం వెనుక నూతన కార్యాలయం భవనం రూ.29కోట్లతో నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు కాంట్రాక్టర్‌కు రూ.5 కోట్లు మాత్రమే బిల్లులు మంజూరు అయ్యాయి. రూ.5కోట్లు నిధి పోర్టల్‌లో ఉంది. మిగిలిన నిధులు వచ్చే వరకు పనులు చేయమని కాంట్రాక్టర్ తేల్చి చెప్పారు.

మిగతా 6వ పేజీలో

కార్మికశాఖ జాయింట్ కమిషనర్ కార్యాలయంలో ఏసీబీ సోదాలు

కర్నూలు క్రైం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కార్మిక శాఖ జాయింట్ కమిషనర్ బాలునాయక్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. నగరంలోని చల్లా కాంపౌండులో ఉన్న ఆయన కార్యాలయంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఏసీబీ సీఐ కృష్ణయ్య, ఎస్ఐ సుబ్బరాయుడు తనిఖీ చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న సమాచారంతో తిరుపతి ఏసీబీ అధికారులు ఆయనకు సంబంధించిన పలు ప్రాంతాల్లో మూకుమ్మడిగా సోదాలు చేశారు. ఇందులో భాగంగా ఈయన కార్యాలయంలో తనిఖీ చేశారు. పలువురు సిబ్బందిని విచారించి పలు విషయాలు సేకరించారు. బాలు నాయక్ సొంత జిల్లా కడప జిల్లా రాయచోటి వద్ద తండా. ఆయన ఉద్యోగంలో కార్మిక శాఖలో పలు విధులు నిర్వహించారు. ఆత్మకూరులో ఏవోగా పని చేశారు. 2020-21లో కర్నూలు రీజనల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌గా పని చేశారు. ఆ తర్వాత జాయింట్ కమిషనర్ ఎఫ్ఏసీగా కొనసాగారు. ఏడాది క్రితం జాయింట్ కమిషనర్‌గా పదోన్నతి పొంది కర్నూలులోనే విధులు నిర్వహిస్తున్నారు. కర్నూలులోని బాలాజీ నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. తిరుపతి, మదనపల్లి, రాయచోటి ప్రాంతాల్లో పలు ఆస్తులు కూడబెట్టినట్లుగా సమాచారం ఉండటంతో ఏకకాలంలో ఈ దాడులు చేశారు. బాలాజీనగర్‌లో ఉన్న తన ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆయన కొడుకును పిలిపించుకుని రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు నిర్వహించారు. ఆయన ఆస్తులకు సంబంధించి మరింత సమాచారం త్వరలోనే వెల్లడిస్తామని ఏసీబీ అధికారులు చెప్పారు.

రైతులు ఆందోళన చెందొద్దు

- జిల్లాలో 1,436 మెట్రిక్ టన్నుల యూరియా
- కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు అన్ని ఎరువులను అందుబాటులో ఉంచుతున్నామని, రైతులు ఆందోళన చెందొద్దు అని కలెక్టర్ రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం 1,436 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. రానున్న ఒకట్రెండు రోజుల్లో 869 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు వస్తుందని అన్నారు. ఈ నెలాఖరుకు 9,575 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావాల్సి ఉండగా.. ఇప్పటికే 6,644 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామన్నారు. జిల్లాలోని అన్ని డీలర్ పాయింట్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి యూరియా నిల్వలను ధృవీకరించాలని అధికారులను ఆదేశించారు.

అనుమతిలేని లే అవుట్లను క్రమబద్ధీకరించుకోవాలి

- 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు


మాట్లాడుతున్న 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు

పత్తికొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అనుమతిలేని లేఅవుట్లను క్రమబద్ధీకరించుకునేందుకు ప్రభుత్వం సువర్ణావకాశాన్ని కల్పించిందని, అలాంటి లే అవుట్లు కలిగిన వారు 90 రోజుల్లో ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని 'కుడా' చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. పత్తికొండ టీడీడీ కల్యాణ మండపంలో ఆర్డీవో భరత్‌నాయక్ నేతృత్వంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులకు నూతన విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సోమిశెట్టి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు సుమారు 300పైగా అక్రమ లేఅవుట్లు వేసి ప్లాట్లు విక్రయించినట్లు తమ విచారణలో తేలిందన్నారు. వీటికి సంబంధించిన అన్నివివరాలు తమవద్ద ఉన్నాయని, అనుమతిలేని లే అవుట్లను 90 రోజులలోపు వాటిని క్రమబద్ధీకరించకపోతే ఆ తర్వాత చట్టపరమైన చర్యలకు ఉపక్రమిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో గురించి ఎల్ఆర్ఎస్ స్కీం గురించి కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తామని, అనుమతిలేని లే అవుట్లు రెగ్యులర్ చేసుకోవడం వల్ల కలిగే లాభాలను అందులో ప్రజలకు తెలియచేస్తామని సోమిశెట్టి వెంకటేశ్వర్లు చెప్పారు. కార్యక్రమంలో 'కుడా' ప్లానింగ్ అధికారులు, స్థానిక కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర కార్యదర్శిగా గీతామాధురి

- కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి స్థానం



కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా సురవరం గీతా మాధురి శుక్రవారం నియమితులయ్యారు. కర్నూలు జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఈమెకు స్థానం కల్పించారు. ఏబీవీపీ నుంచి ప్రస్థానాన్ని మొదలు పెట్టి బీజేపీలో మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలుగానూ, రాష్ట్ర కార్యదర్శిగానూ, మహిళా మోర్చా రాష్ట్ర జనరల్ సెక్రటరీగా పని చేశారు. ఈమెకు పదవి రావడంపై బీజేపీ నాయకులు హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా గీతా మాధురి మాట్లాడుతూ తనపై పార్టీ ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీని పటిష్ట పరిచేందుకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర కార్యవర్గంలో తనకు అవకాశం కల్పించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు ధన్యవాదాలు తెలిపారు.

తడిసిపోతున్నాయ్..!

- రికార్డుల గదులను తనిఖీ చేయని అధికారులు
- పలు కార్యాలయాల్లో శిథిలావస్థలో భవనాలు
- భయంతో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు


తడిసిపోయిన ఫైళ్లు

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఏ కార్యాలయంలో అయినా ఏదైనా సమాచారం కావాలంటే ముందుగా వెతికేది రికార్డులే. అలాంటి రికార్డులు భద్రంగా ఉన్నాయా.. లేదా అన్న విషయాన్ని అధికారులు పూర్తిగా విస్మరించారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో భూములు, రెవెన్యూ తదితర రికార్డులన్నీ ఒక ప్రత్యేక గదిలో భద్రపరుస్తారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో రికార్డు భద్రపరిచిన గదిలో అక్కడక్కడ వర్షపు నీరు చేరుతోంది. కానీ ఆ రికార్డు రూమును ఏరోజు కూడా అధికారి తనిఖీ చేయడం లేదు. అలా ఆ వర్షం నీరుతో రికార్డులన్నీ తడిసి ముద్దవుతున్నాయి. మరికొందరు సిబ్బంది రికార్డులు తడిసిపోయిన కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. కొన్ని కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. శిథిలావస్థలో ఉన్న కార్యాలయంలో రికార్డులన్నీ చేతికి అందని స్థితికి చేరుకుంటున్నాయి. కలెక్టరేట్‌లోని శ్రీశైలం ప్రాజెక్టు కార్యాలయం శిథిలావస్థకు చేరింది.


పెచ్చులూడిన పైకప్పు


ఇటుకలు పడిపోయిన గోడ


వర్షం వస్తే చాలు.. కార్యాలయం చిత్తడిగా మారుతోంది. కార్యాలయంపై భాగం పెచ్చులూడిపోయి కిందపడుతోంది. వర్షం నీరు రావడంతో పాత రికార్డులన్నీ జలమయమవుతున్నాయి. భవనం శిథిలావస్థకు చేరడంతో కార్యాలయంలో పని చేసే సిబ్బంది కూడా భయభ్రాంతులకు గురవుతున్నారు.

విదేశాలకు ఉత్పత్తుల ఎగుమతులకు సహకారం

రాయలసీమ రీజియన్ పీఎంజీ కార్యాలయం ఏడీ రామకృష్ణ


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న పోస్టల్ అధికారులు

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వ్యాపారులు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేందుకు పోస్టల్ శాఖ పూర్తి సహకరిస్తుందని రాయలసీమ రీజియన్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ వై.రామకృష్ణ అన్నారు. నగరంలోని ప్రధాన తపాలా కార్యాలయంలో వ్యాపారవేత్తలు, చిన్నవ్యాపారులు, ఉత్పత్తిదారులకు తమ ఉత్పత్తులను విదేశాలకు ఎలా ఎగుమతి చేయాలనే అంశంపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. అవగాహన కార్యక్రమానికి కర్నూలు, నంద్యాల, అనంతపురం, హిందూపురం జిల్లాలకు సంబంధించిన క్లస్టర్‌లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాపారులు తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఏడీ రామకృష్ణ మాట్లాడుతూ విదేశీ మార్కెట్లకు ఎగుమతులపై అవకాశాలపై పోస్టల్ శాఖలో అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. చిన్న వ్యాపారవేత్తలు, ఉత్పత్తిదారులు తపాలాశాఖ ద్వారా సులభంగా, వేగంగా తక్కువ వ్యయంతో తమ ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పీఎంజీ రీజనల్ కార్యాలయం ఏడీ నాగానాయక్, పోస్టల్ సూపరింటెండెంట్ జి.జనార్దన్‌రెడ్డి, సర్కిల్ కార్యాలయం నుంచి వెంకట సాయి, ఫజుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

29న తెలుగు కవుల సమ్మేళనం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో తెలుగు కవుల సమ్మేళనం ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షులు కళారత్న పత్తి ఓబులయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 29న సాయంత్రం 6 గంటలకు కళాక్షేత్రంలోని సాహితీ వేదికపై ఈసమ్మేళనం ఉంటుందని చెప్పారు. ఇందులో పాల్గొనే కవులు తెలుగు భాషలో పద్యం గానీ, గేయ కవిత్వం గానీ మూడు నిమిషాల వ్యవధిలో చదవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కవుల సమ్మేళనంలో పాల్గొన్న కవులకు కళాక్షేత్రం చైర్మన్, రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ చేతుల మీదుగా సత్కారం ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల కవులు, కవయిత్రులు తమ పేర్లు 9989265632 వాట్సాప్ నెంబరుకు తెలియజేయాలని ఆయన తెలిపారు.

పెండింగ్ బిల్లులకు మోక్షం

- వైసీపీ హయాంలో డబ్బులు అందక ఇబ్బందులు పడ్డ కాంట్రాక్టర్లు, రైతులు
- ఉమ్మడి జిల్లాలో రూ.9 కోట్ల బిల్లులు
- త్వరలోనే బ్యాంకు ఖాతాల్లో జమ



కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): టీడీపీ హయాంలో 2014-19 కాలంలో రైతులు ఏర్పాటు చేసుకున్న మినీ గోకులాలతో పాటు నీరు-చెట్టు కార్యక్రమం కింద పొలాల్లో తవ్వకున్న నీటి గుంతలు, వంకలు వాగుల్లో నిర్మించిన చెక్ డ్యామ్‌లు తదితర వాటికి బిల్లులు ఇవ్వలేదు. దీతో రైతులు, కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వాలు మారినా అప్పటి వరకు జరిగిన పనులకు సంబంధించి బకాయిలు చెల్లిస్తేనే కొత్తగా ఎవరైనా తిరిగి ప్రభుత్వ పనులు చేయగలుగుతారు. అయితే.. వైసీపీ ప్రభుత్వం మాత్రం అందుకు విరుద్ధంగా ప్రభుత్వ పనులు చేసిన వారిని మానసిక క్షోభకు గురి చేసింది. అప్పట్లో పనులు పూర్తి చేసిన వారు బిల్లుల కోసం హైకోర్టును కూడా ఆశ్రయించారు. హైకోర్టు ఆదేశాలతో కొంత మేర కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించారు. అయినా కూడా పూర్తి స్థాయిలో బిల్లులు చేతికి అందక వారు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తూనే ఉన్నారు. 2014-19లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పెండింగ్ బిల్లుల కోసం రైతులు, కాంట్రాక్టర్లు ఇప్పటికీ కూటమి ప్రభుత్వంలోని పాలకుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఉపాధి హామీ పథకం కింద 2014-19 కాలంలో కర్నూలు జిల్లాలో రూ.4 కోట్లు, నంద్యాల జిల్లాలో రూ.5 కోట్లకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. ఎట్టకేలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ బిల్లులను చెల్లించేందుకు అనుమతి ఇచ్చారు. తాజాగా కేంద్రం అనుమతితో క్షేత్ర స్థాయి నుంచి నివేదికలు తెప్పించుకుని మొత్తం పనులు ఆన్‌లైన్ చేశారు. గోకులం షెడ్లు, సీసీ రోడ్లు, డ్రైన్లు, సంపద కేంద్రాలు, వర్మీ కంపోస్టు, వ్యక్తిగత మరుగుదొడ్లు, నీరు-చెట్టు కార్యక్రమం కింద చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు త్వరలోనే రైతులతో పాటు కాంట్రాక్టర్ల బ్యాంకు ఖాతాలకు జమ కానున్నాయి.

పనుల వివరాలు ఆన్‌లైన్ చేశాం



2014-19 కాలంలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనులకు సంబంధించి పూర్తి వివరాలను ప్రభుత్వ ఆదేశాలతో ఆన్‌లైన్ చేశాం. ప్రస్తుతం బిల్లులకు సంబంధించి రైతులు, కాంట్రాక్టర్లకు చెల్లించే కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- వెంకటరమణయ్య, డ్వామా పీడీ, కర్నూలు

సాగునీరు శాపమై..

- గంగ అధికారుల నిర్లక్ష్యం
- సాగుచేయకుండా వదిలేసిన 30 ఎకరాలు
- ఆందోళనలో రైతన్నలు

రుద్రవరం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రైతులకు సాగునీరు అందితే వారి ఆనందానికి అవధులు ఉండవు. అలాంటి సాగునీరే ఆ రైతుల పాలిట శాపంగా మారింది. పొలాల్లోకి మోతాదుకు మించి నీరు చేరడంతో పంటను సాగుచేయలేక రైతులు అలాగే వదిలేశారు. 22వ గంగ బ్లాక్‌ఛానెల్ నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో 30ఎకరాల్లో భూమి సాగు చేయకుండా వదిలేశామని టి.లింగందిన్నె, నాగులవరం రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. 22 వ బ్లాక్‌ఛానెల్‌లో నీటి సామర్థ్యం పెరగడంతో పంట పొలాల్లో ప్రవహిస్తున్నాయి. కనీసం ట్రాక్టర్లు, ఎద్దులతో దున్నడానికి కూడా వీలు కాకుండా ఉందని రైతులు పేర్కొంటున్నారు. కళ్లెదుటే సాగునీరు ఉన్నా భూమి సాగు చేసుకోలేకపోతున్నాం. గంగ అధికారులు నిర్లక్ష్యానికి వదిలేశారు. 22వ బ్లాక్‌ఛానెల్ తూము షట్టరు మరమ్మతులు చేయకపోవడమే కారణమని రైతుల వాపోతున్నారు. అధికారులు మాత్రం కాల్వకు నీరు వదిలామని చేతులెత్తేశారు. రైతులు ఎన్నిసార్లు ఇలా చెప్పినా పట్టించుకోవడంలేదన్నారు. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు సాగునీరు ఉన్నా భూమిలో విత్తనం వేయడానికి సాగునీరు అడ్డంకిగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

నీటి సామర్థ్యం తగ్గించాలని..

తెలుగుగంగ అధికారులకు కాల్వలో నీటి సామర్థ్యం తగ్గించాలని ఫిర్యాదు చేశాం. అధికారులు మాత్రం పట్టించుకోలేదు. భూమి సాగు చేసుకోవడానికి వీలు లేకుండా ఉంది.

- వెంకటరమణ, రైతు, టి.లింగందిన్నె

మూడెకరాల భూమిని వదిలేశా..

తెలుగుగంగ 22వ బ్లాక్‌ఛానెల్‌లో అధికంగా సాగునీరు ప్రవహిస్తుంది. తాను మూడు ఎకరాల భూమిని సాగుచేయకుండా వదిలేశా. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు.

- బాలపెద్దయ్య, రైతు, టి.లింగందిన్నె


టి.లింగందిన్నె గ్రామ సమీపంలో పంట పొలాల్లో ప్రవహిస్తున్న గంగ నీరు

ఉప రాష్ట్రపతి అభ్యర్థిని కలిసిన ఎమ్మెల్యే


రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఆదోని, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎన్‌డీయే ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను శుక్రవారం ఢిల్లీలో ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయన మాట్లాడుతూ బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ నేతృత్వంలో పలు రాష్ట్రాలకు చెందిన ఓబీసీ మోర్చా పదాధికారులు ఉప రాష్ట్రపతి అభ్యర్థి రాధాకృష్ణన్‌ను కలిసి సంఘీభావం ప్రకటించామని చెప్పారు. బీసీ సామాజికవర్గానికి చెందిన రాధాకృష్ణను ఎన్డీయే కూటమి ఉప రాష్టపతి అభ్యర్థిగా నిలబెట్టడం హర్షణీయమని అన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ బీసీ సామాజికవర్గానికి ప్రాధాన్యం ఇస్తోందని, ఇటీవల రాష్ట్రం నుంచి ఇద్దరు రాజ్యసభ సభ్యులు బీసీలేనని గుర్తు చేశారు. మాటల్లోనే కాదు చేతల్లోనూ బీజేపీ బీసీలకు అవకాశాలు కల్పిస్తోందన్నారు. బీసీలను రాజ్యాధికారులుగా చేయడమే బీజేపీ లక్ష్యమన్నారు.

ఉరుకుంద హుండీ ఆదాయం రూ.1.08 కోట్లు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

కౌతాళం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానంలో స్వామి వారికి శ్రావణ మాసం సందర్భంగా పది రోజులకు సంబంధించి భక్తులు సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. దేవస్థానపు కాలక్షేపపు మండపంలో హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని ఆలయ డిప్యూటీ కమిషనర్, ఈవో వాణి ఆధ్వర్యంలో చేపట్టారు. ఆమె మాట్లాడుతూ భక్తులు స్వామి వారికి సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కింపు కొనసాగగా నగదు రూపంలో రూ.1,08,04,708, బంగారం 1.950 గ్రాములు, వెండి 22.5 కిలోలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హుండీ పర్యవేక్షణ అధికారి సుధాకర్‌రెడ్డి, ఆలయ అధికారులు మల్లికార్జున, వెంకటేశ్వరరావు, దేవాలయపు ఉప ప్రధాన అర్చకులు మహదేవప్ప, అర్చకులు నాగరాజు స్వామి, శివన్న స్వామి, బ్యాంకు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీమాతకు కరెన్సీ నోట్లతో అలంకారం



నంద్యాల కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నూనెపల్లె వాసవీ మాత ఆలయంలో అమ్మవారికి కొత్త కరెన్సీ నోట్లతో అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. . కాళికాంబ ఆలయంలో కాళికాంబ అమ్మవారికి, నూనెపల్లె అమ్మవారిశాలలోని వాసవీ మాతకు శ్రావణమాస చివరి శుక్రవారం పూజలు వైభవంగా నిర్వహించారు. కుంకుమార్చనలు, ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళామండలి , యువజన సంఘం, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కామేశ్వరీదేవికి పండ్లతో..


కామేశ్వరీదేవిని పండ్లతో అలంకరించిన దృశ్యం

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలోని కామేశ్వరీదేవి అమ్మవాని వివిధ రకాల పండ్లతో అలంకరించారు. శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలతో పాటు కుంకుమార్చన పూజలను వేదమంత్రాలతో నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పండ్ల అలంకారంతో ఉన్న అమ్మవారిని భక్తులకు దర్శనం ఏర్పాటు చేశారు. వేలాదిమంది భక్తులు మహానంది ఆలయంను దర్శించుకున్నారు. ఆలయ ఈవో నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు దర్శనం సమయంలో ఎలాంటి ఆటంకాలు లేకుండా చేశారు.

విశ్వసాహితీ కళావేదిక రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ప్రసాద్



నంద్యాల కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): విజయవాడ కేంద్రంగా నిర్వహిస్తున్న విశ్వసాహితీ కళావేదికలో నంద్యాలకు చెందిన రచయిత కొప్పుల ప్రసాద్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమించినట్లు ఆకళావేదిక చైర్ పర్సన్ కొల్లి రమావతి తెలిపారు. శుక్రవారం రచయిత్ ప్రసాద్ విలేకరులతో మాట్లాడారు. ఒక ఆశయంతో సాహిత్యాభిలాషతో నిరంతరం సాహిత్య సాంస్కృతిక సమాజ సేవా కార్యక్రమలు చేయాలనే తలంపుతో ప్రారంభించిన జాతీయ స్థాయి సంస్థ విశ్వసాహితీ కళావేదిక అని అన్నారు. ఈ సంస్థలో తనకు స్థానం కల్పించడంతో తనకు ఒక కొత్త బాధ్యతను అప్పగించారన్నారు. రచయిత కొప్పుల ప్రసాద్‌ను నంద్యాలకు చెందిన కవులు, రచయితలు, తెలుగు ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మహబూబ్ బాషా, డా.నీలం వెంకటేశ్వర్లు, కవి నరేంద్ర, కళారాధన కార్యదర్శి డాక్టర్ రవిక్రిష్ణ, అంతర్జాతీయ శాస్త్రవేత్త డా రవీంద్రనాథ్, కళాకారులు అభినందనలు తెలిపారు.

మహానందిలో నాగుపాము ప్రత్యక్షం


నాగుపామును పట్టుకొన్న స్నేక్ క్యాచర్ మోహన్

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయం ముందు భాగంలోని కరివెన నిత్యాన్నదాన సత్రం పరిసరాల్లో ఎనిమిది అడుగుల నాగుపాము ప్రత్యక్షం అయ్యింది. శుక్రవారం సత్రం ఆవరణలో ఉన్న నాగుపామును చూసిన సిబ్బంది వెంటనే స్నేక్ క్యాచర్ మోహన్‌కు సమాచారమిచ్చారు. ఆయన చాకచక్యంగా నాగుపామును పట్టుకొని సమీపంలోని నల్లమల అడవిలో వదిలారు. వర్షాకాలం కావడంతో పాటు సమీపంలో అడవి ఉండటంతో విషసర్పాల సంచారం మహానంది పరిసరాల్లో ఇటీవల అధికమైంది.

బిల్లుల కోసం ఎదురుచూపులు

5వ పేజీ తరువాయి

నగరపాలక సంస్థ పరిధిలోని 52 వార్డుల్లో రూ.500కోట్లు పనులు జరిగినట్లు ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సాక్షాత్తూ మేయర్ బీవై. రామయ్య చెప్పారు. కర్నూలు-33, పాణ్యం-16, కోడుమూరు-3 వార్డులు వస్తాయి. ఈక్రమంలో ఇప్పటివరకు జరిగిన పనుల్లో నాయకులతో పాటు ప్రజాప్రతినిధులకు కాంట్రాక్టర్లు పర్సెంటీజీలు ఇస్తేనే బిల్లులు జమ అవుతున్నట్లు చెప్పుకుంటున్నారు. గతంలో వైసీపీ నాయకులకు దగ్గరంగా ఉండే కాంట్రాక్టర్ల బిల్లులు, ప్రస్తుతం కూటమి నాయకులకు దగ్గరగా ఉండే కాంట్రాక్టర్ల బిల్లులు మంజూరు అవుతున్నాయి. రూ.500కోట్లకు 5శాతం వేసుకున్న దాదాపు రూ.25కోట్లు వైసీపీ, కూటమి ప్రజాప్రతినిధులకు పర్సెంటీజీల రూపంలో వసూలు చేసినట్లు తెలుస్తోంది.

బిల్లులు కావాలంటే మామూళ్లు..

ప్రభుత్వ ఖాతా నిధి పోర్టల్‌లో బిల్లులు పంపుతారు. అక్కడ ఓకే అయితేనే ప్రభుత్వం మంజూరుచేసి బిల్లులను నేరుగా కాంట్రాక్టర్ల ఖాతాలోకి జమ అవుతాయి. బిల్లులు చేయాలంటే కొందరు అధికారులకు మామూళ్లు ఇచ్చుకోక తప్పదని కొందరు కాంట్రాక్టర్లు బహిరంగంగానే చెబుతున్నారు. ఓ ఏఈకి కాంట్రాక్టర్లు మామూళ్లు ఇవ్వడం లేదని సుమారు 30నుంచి 40 బిల్లులు పెండింగ్‌లో పెట్టినట్లు విశ్వసనీయ సమాచారం. ఆ ఏఈకి ఉన్నతాధికారులు కీలక పనులు అప్పగించారు. దీంతో ఆడిందే ఆట.. పాడింది పాటగా పబ్బం గడుపుకుంటున్నాడు. కాంట్రాక్టర్లు బిల్లుల కోసం కార్యాలయం చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి నెలకొంది.

మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకుని..

రాష్ట్ర మంత్రి టీజీ భరత్ చొరవ తీసుకుని నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులను త్వరితగతిన మంజూరు చేయించాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు. పనులు వేగవంతంగా ముందుకు పోవాలంటే బిల్లులు మంజూరు కావాల్సిందేనని కొందరు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసిన బిల్లులు ఇప్పటి వరకు ఒక్కటి కూడా ఆమోదం పొందకపోవడం ఏమిటని కొందరు ప్రశ్నిస్తున్నారు.

అప్‌లోడ్ చేశాం

ప్రస్తుతం ఎన్ని పనులు చేశారో అన్నింటికి సంబంధించిన బిల్లులను సీఎఫ్‌ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశాం. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరైన వెంటనే కాంట్రాక్టర్ల ఖాతాలో జమ అవుతాయి. కాంట్రాక్టర్ల వద్ద ఎలాంటి వసూళ్లు చేయలేదు.

- శేషసాయి, ఇన్‌చార్జి ఎస్ఈ, నగరపాలక సంస్థ, కర్నూలు

డ్రైవింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ యువతకు హెవీ మోటార్స్ వెహికల్స్ డ్రైవింగ్ శిక్షణ కోసం ఆసక్తిగల ఎస్సీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కనీసం ఒక సంవత్సరం కాలపరిమితి గల లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్న పురుషులు, మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 27 చివరి గడువు అని తెలిపారు. ఈ శిక్షణకు పది మంది ఎంపిక చేస్తామని, శిక్షణకు సంబంధించిన ఫీజును కార్పొరేషన్ ద్వారా భరిస్తుందని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సెల్ నెంబర్‌ను సంప్రదించాలని ఆయన కోరారు.

వ్యక్తి అదృశ్యం



రమేశ్ (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్టాపురం గ్రామానికి చెందిన దేశపోగు రమేశ్(32) అదృశ్యమయ్యాడు. నెల క్రితం కర్నూలుకు వెళుతున్నానని ఇంటి నుంచి బయలుదేరాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. దీంతో బంధువులు, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికారు. అయినా ఆచూకీ లభ్యం కాలేదు. రమేశ్ తండ్రి నారాయణ ఫిర్యాదు చేశారని ఎస్‌ఐ అశోక్ తెలిపారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ఆదోని రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నగోనేహాళ్ గ్రామానికి చెందిన సుమంగమ్మ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈనెల 19వ తేదిన కొడుకు బసన్నతో కలిసి ద్విచక్ర వాహనంపై ఆమె ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనం కోసం వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి గ్రామానికి వస్తుండగా కడితోట సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి కిందపడ్డారు. తీవ్ర గాయాలైన ఆమెను చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించారు. అయితే చికిత్స పొందుతూ గురువారం అర్ధరాత్రి మృతి చెందినట్లు ఇస్వీ ఎస్‌ఐ నాయక్ తెలిపారు.

అర్చకుల మధ్య వాగ్వాదం!

- పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ
- ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

మహానంది, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో అర్చకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. చివరికి ఈ పంచాయితీ పోలీసుస్టేషన్‌కు చేరినట్లు సమాచారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈవిషయం మహానందిలో చర్చాంశనీయంగా మారింది. తమ విధులు పూర్తయ్యాక వేర్వేరుగా మద్యం సేవించిన అర్చకులు ఒకరిని ఒకరు దూషించుకొని బహిరంగంగా వాదులాడుకున్నట్లు తెలిసింది. ఉదయం పోలీసులు స్టేషన్‌కు రప్పించి ఇరువురు అర్చకులను మీరే ఇలా ప్రవర్తిస్తే ఎలా అని సున్నితంగా మందలించి పంపినట్లు సమాచారం. గతంలో కూడా ఇలాంటి సంఘటనలు ఆలయ ఉన్నతాధికారి దృష్టికి రావడంతో ఆయన తీవ్రంగా హెచ్చరించినట్లు తెలిసింది.

కారు దగ్ధం



ఆస్పరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తుకూరు బస్టాండ్ సమీపంలో కోడుమూరు నుంచి ఆస్పరి వైపువస్తున్న కారు శుక్రవారం రాత్రి దగ్ధమైంది. కారులో ఆకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో కారును వదిలేసి ప్రాణభయంతో తప్పించుకున్నట్లు డ్రైవర్ సలీంబాషా తెలిపారు. ఘటనాస్థలికి ఆలూరు ఎక్సైజ్ సీఐ లలిత చేరుకొని పరిశీలించారు.

మహిళపై ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం

- కేసు నమోదు.. రిమాండుకు తరలింపు

నంద్యాల టౌన్, ఆగస్టు22 (ఆంధ్రజ్యోతి): నంద్యాల పట్టణానికి చెందిన ఓ మహిళపై నంద్యాల రైల్వే స్టేషన్‌లో ఆటో డ్రైవర్ అత్యాచారయత్నం చేసినట్లు త్రీటౌన్ సీఐ కంబగిరి రాముడు శుక్రవారం తెలిపారు. సీఐ వివరాల మేరకు.. గురువారం రాత్రి 2 గంటల సమయంలో ఓ మహిళ రైలు దిగి ఆటో కోసం ఆటో డ్రైవర్ సమర సింహంను అడుగగా అతను తన ఆటోలో ఎక్కించుకుని పట్టణ శివారురులో అత్యాచారానికి ప్రయత్నించగా ఆమె తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి అతన్ని రిమాండుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

జీఎన్‌ఎం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



కర్నూలు మెడికల్ కాలేజీలో జీఎన్‌ఎం పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీ ఎగ్జామినేషన్ హాలులో జీఎన్‌ఎం నర్సింగ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. పరీక్షలకు 13 ప్రభుత్వ, ప్రైవేటు జీఎన్‌ఎం కాలేజీ విద్యార్థులు హాజరయ్యారు. మొదటి రోజు 346 మంది విద్యార్థులకు గానూ 290 మంది హాజరు కాగా 56 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాన్ని చీఫ్ ఎగ్జామినర్‌గా సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ పద్మజ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ వినోదిని పర్యవేక్షించారు. ఈ పరీక్షలు సెప్టెంబరు 1వ తేదీ వరకు జరగనున్నాయి. గత ఏడాది జరిగిన నర్సింగ్ విద్యార్థుల పరీక్షలకు, మినిస్టీరియల్ స్టాఫ్‌ను ఇన్విజిలేటర్లుగా నియమించడంతో కాపీయింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈసారి కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవతో ముగ్గురు మెడికల్ ఆఫీసర్లు, 14 మంది హెడ్ నర్సులు, స్టాఫ్ నర్సులను ఇన్విజిలేటర్లుగా నియమించి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు.

అధికారులపై దాడులు హేయం

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి



ఎస్పీకి వినతి పత్రం అందజేస్తున్న వైసీపీ నాయకులు

నంద్యాల రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో టీడీపీ నాయకులు అధికారులపై దాడులు చేయడం హేయమైన చర్య అని వైసీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక వైసీపీ కార్యాలయంలో జిల్లాలోని మాజీ ఎమ్మెల్యేలతో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండు తెలుగు రాష్ట్రాల్లో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అటవీ శాఖ అధికారులపై దాడి చేయడం హల్‌చల్‌గా మారిందన్నారు. పార్టీకి చెందిన ఎమ్మెల్యే అయిన సీఎం, డిప్యూటీ సీఎం కేసు నమోదు చేయమనడం బూటకన్నారు. ఎమ్మెల్యేపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండు చేశారు. అంతే కాకుండా జిల్లాలో యూరియా కొరత కూడా టీడీపీ నాయకుల వల్లే ఏర్పడుతోందన్నారు. టీడీపీ నాయకులు వారికి నచ్చినట్లు లారీల లోడును తరలించడం మంచిదికాదన్నారు. దీంతో సామాన్య రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. అలాగే ఈ ఎమ్మెల్యే అనుచరులే గతంలో కూడా ఏరాసు ప్రతాప్‌రెడ్డిపై దాడికి పాల్పడ్డారన్నారు. బీసీ జనార్దన్‌రెడ్డి సోదరుడు ఏఆర్ కానిస్టేబుల్‌పై దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. అనంతరం ఎస్పీ, డీఆర్వోకు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కాటసాని రామిరెడ్డి, శిల్పా చక్రపాణి రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలి

- మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని ముట్టడించిన మహిళా కూలీలు
- గ్రేడింగ్ వల్ల రైతులు నష్టపోతారు
- లైసెన్స్ లేని కూలీలు ఆందోళన చేస్తే ఉపేక్షించం
- కార్యదర్శి కల్పన హెచ్చరిక

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డ్‌లో గ్రేడింగ్ విధానాన్ని కొనసాగించాలంటూ మహిళా కూలీలు డిమాండ్ చేశారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. వారు మాట్లాడుతూ ఈనెల 25 నుంచి రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ దిగుబడులకు పాసింగ్ విధానం లేకుండా కొనుగోలు చేయాల్సిందేనని మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎం. కల్పన వ్యాపారులను ఆదేశించారు. రైతులకు నష్టం కలిగించే విధానాన్ని మార్కెట్ యార్డ్‌లో అమలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. వ్యాపారుల దగ్గర పనిచేస్తూ గ్రేడింగ్ చేస్తున్న మహిళా కూలీలను కొందరు రెచ్చగొట్టి కార్యాలయం వైపు ఉసిగొల్పినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో 250 మందిపైగా మహిళా కూలీలు మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడించి అక్కడే బైఠాయించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే తాము ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని యార్డు అధికారులు హెచ్చరించారు. గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేస్తే తమకు ఉపాధి కోల్పోతామని, ఎన్నో ఏళ్ల నుంచి మార్కెట్ యార్డ్ పైనే జీవనం చేస్తున్నామంటూ చెప్పుకొచ్చారు. ఇది వేరుశనగ వ్యాపారులకు, మీకు సంబంధించినదని, లైసెన్స్ కలిగిన కూలీలు కానప్పుడు ఇక్కడ ఆందోళన చేయవద్దంటూ సూచించారు. మధ్యాహ్నం రెండు గంటల వరకు కమిషన్ ఏజెంట్ల దుకాణాల వద్దకు వెళ్లకుండా తూకాలు నిలుపుదల చేయడంతో ఒకటో పట్టణ పోలీసులు అక్కడ చేరుకొని వారికి సర్దిచెప్పారు. రైతులకు నష్టం కలిగించే విధానం అని, వ్యాపారులతో మీరు మాట్లాడుకోవాలని అక్కడి నుంచి పంపించేశారు. వ్యాపారులు మాత్రం పాసింగ్ కొనసాగిస్తేనే వేరుశనగ దిగుబడును కొనుగోలు చేస్తామని చెబుతున్నారు. పాసింగ్ విధానం రద్దు చేస్తారా? కొనసాగిస్తారా? అన్న దానిపై సందేహాలు వ్యక్త అవుతున్నాయి. మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన మాట్లాడుతూ మహిళా కూలీలు వచ్చి ఇక్కడ ఆందోళన చేస్తే ఉపేక్షించబోమని, వారు లైసెన్స్ దారులు కాదని చెప్పారు. వ్యాపారులతో మాట్లాడుకోవాలని సూచించారు.



మార్కెట్‌యార్డు కార్యాలయాన్ని ముట్టడించిన కూలీలు

మత్తు మందులు అడిగితే సమాచారమివ్వండి

- నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తే చర్యలు
- భవిష్యత్తులో 'గరుడ 2.0'
- అడిషనల్ ఎస్పీ యుగంధర్‌బాబు

నంద్యాల హాస్పిటల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): యువత మెడికల్ షాపుల్లో మత్తు ఇచ్చే మందులు అడిగితే వారి వివరాలు పోలీసులకు తెలపాలని నంద్యాల అడిషనల్ ఎస్పీ యుగంధర్ బాబు అన్నారు. శుక్రవారం పట్టణంలోని తేజస్విని హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో నంద్యాల డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న ఆధ్వర్యంలో నార్కోటిక్ డ్రగ్స్, యాంటీ బయాటిక్స్ వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌లు, ఈగల్‌టీం ఎప్పటికప్పుడు నిఘా ఉంచి మత్తు పదార్థాలపై గమనిస్తుంటుందన్నారు. మెడికల్ షాప్ యజమానులు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా పేషెంట్లకు ఎలాంటి ఎన్ఆర్ఎక్స్ మందులు ఇవ్వద్దన్నారు. ఈగల్ ఐజీపీ ఆర్కే రవికృష్ణ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా వంద టీమ్‌లతో ఆపరేషన్ గరుడ అనే పేరుతో మెడికల్ షాప్‌లపై దాడులు నిర్వహించారన్నారు. అందులో భాగంగా నంద్యాల జిల్లాలో దాదాపు 10 మెడికల్ షాప్‌లపై దాడులు నిర్వహించి ఎన్ఆర్ఎక్స్ మందుల అమ్మకం, హెచ్1రిజిష్టర్, ఓటీసీ సేల్స్ మరికొన్ని నిబంధనలకు విరుద్ధంగా విక్రయించినట్లు తేలడంతో కేసులు నమోదు చేశామన్నారు. భవిష్యత్‌లో ఆపరేషన్ గరుడ 2.0 ఉంటుందని అప్పట్లోగా మెడికల్ షాప్‌ల యజమానులు వ్యాపార దృష్ట్యా కాకుండా సమాజంపైన బాధ్యతగా ఉండి జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటరమణ, డ్రగ్స్ శాఖ ఏడీ రమాదేవి, కర్నూలు డ్రగ్ ఇన్‌స్పెక్టర్ జయరాముడు, నంద్యాల జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు దామోదరరెడ్డి, ఈగల్‌టీం సిబ్బంది, జిల్లాలోని మెడికల్ ఏజెన్సీ, షాపుల యజమానులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ముఖ్య అతిథులు

సాగుకు యోగ్యంకాని భూములిచ్చారు..

- రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన లబ్ధిదారులు
- విచారణ చేపట్టిన డోన్ ఆర్డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

బనగానపల్లె, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఎస్సీలకు ఇచ్చిన భూములు సాగుకు పనికిరావని లబ్ధిదారులు పేర్కొన్నారు. దీనిపై ఎనిమిది లబ్ధిదారులు ఇటీవలే జిల్లా రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం డోన్ ఆర్డీవో నరసింహులు ఆధ్వర్యంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి, తహసీల్దార్ విచారణ చేపట్టారు. బాధితులు తెలిపిన వివరాలు.. 2016-17లో 12మంది ఎస్సీ లబ్ధిదారులకు భూమి కొనుగోలు పథకం కింద మండలంలోని జమ్ములదిన్నె గ్రామంలో భూమి కొనుగోలు చేసి ఎస్సీలకు పట్టాలిచ్చారు. సాగుకు పనికిరాని భూములు తమకు అంట గట్టారంటూ ఎనిమిది మంది లబ్ధిదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అధికారులు విచారణ చేపట్టారు. తహసీల్దారు నారాయణరెడ్డి మాట్లాడుతూ అప్పటి రెవెన్యూ అధికారులు భూమి కొనుగోలు పథకం కింద 12 మందికి పట్టాలు ఇచ్చారన్నారు. కొంతమంది లబ్ధిదారులకు భూముల విషయంపై జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయగా భూములను పరిశీలించామన్నారు. నివేదికను కలెక్టర్‌కు సమర్పిస్తామని తెలిపారు.

అప్పట్లోనే దుమారం..

2016-17 సంవత్సరంలో ఎస్సీలకు భూమి కొనుగోలు పథకంలో భాగంగా ఇచ్చిన భూముల విషయంలో భారీగా అక్రమాలు జరిగినట్లు విమర్శలు వచ్చాయి. మధ్య దళారీలు ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో కుమ్మక్కయినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. జమ్ములదిన్నె గ్రామంలో సాగుకు పనికి రాని భూములను కొనుగోలు చేసి దళారులు, ఎస్సీ కార్పొరేషన్ అధికారుల, బనగానపల్లె స్థానిక రెవిన్యూ అధికారులు కుమ్మక్కై ఈభూములను లబ్ధిదారులకు అందజేసినట్లు ఆరోపణలున్నాయి. ఎకరా రూ.10వేలు కూడా విలువ చేయని సాగుకు పనికిరాని భూములను దళారులు ఎకరా రూ.6 లక్షలకు ఎస్సీ భూమి కొనుగోలు పథకం కింద ప్రభుత్వానికి అమ్మి ఆసొమ్మును దళారులు అప్పటి రెవెన్యూ, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు స్వాహా చేసినట్లు ఆరోపణలు వెల్లివిరిశాయి.



జమ్ములదిన్నెలో భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో నరసింహులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ తులసీదేవి, సిబ్బంది

కుక్కల దాడిలో 150 గొర్రె పిల్లల మృతి

- రూ. 1.50 లక్షల నష్టం

బేతంచెర్ల, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): బేతంచెర్ల- డోన్ రోడ్డులో ముచ్చట్లు వాగు వద్ద గొర్రెలదొడ్డిలో శుక్రవారం రాత్రి గొర్రె పిల్లలపై కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 150 గొర్రె పిల్లలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధితులు వాపోయారు. రంగాపురం గ్రామానికి చెందిన గోపాలు, సిద్దయ్య, బాలబుడ్డి అనే గొర్రెల కాపరులు మేకలకు ముచ్చట్ల వాగు వద్ద గొర్రెలదొడ్డి ఏర్పాటు చేసుకున్నారు. అయితే గుర్తు తెలియని వ్యక్తి ఒక గొర్రె పిల్లను దొంగతనం చేసేందుకు కల్లందొడ్డి తెరిచి వెళ్లాడు. దాంతో కుక్కలు దొడ్డిలోకి వెళ్లి మేకపిల్లలపై దాడి చేసి 150 గొర్రెపిల్లలను చంపాయని బాధితులు వాపోయారు. ముగ్గురు గొర్రెల కాపరులకు చెందిన 50 చొప్పున 150 గొర్రె పిల్లలను నష్టపోయామని కన్నీరుమున్నీరై విలపించారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలి

నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల రూరల్ ఆగస్టు, 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లను పునరుద్ధరించాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్ అన్నారు. శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాలా మంది అర్హులైన వారికి కూడా పింఛన్ తీసేయడం బాధకరమన్నారు. దీంతో వారు భయాందోళనకు గుర వుతున్నారన్నారు. రీ వెరిఫికేషన్ చేయించుకోవడానికి దూరం ప్రాంతాల నుంచి రావాలంగే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారికి ఇబ్బందులు కలుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రజాక్ హుసేన్, ధనుంజయ్, రమణ తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన కొబ్బరి బోండం

- ధర రూ.50 నుంచి రూ.70 వరకు పలుకుతున్నవైనం
- పెరిగిన కొబ్బరి నూనె రేటు



కొలిమిగుండ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కొబ్బరి బోండం ధరలు కొండెక్కాయి. ఒక్కో కొబ్బరి బోండం ధర సైజును బట్టి రూ.50 నుంచి రూ.70కి పైగా పలుకుతుండటంతో సామాన్య మధ్యతరగతి ప్రజలు కొనలేని పరిస్థితి నెలకొంది. గతంలో రూ.25, 30 ఉన్న కొబ్బరి బోండం ధరలు గత కొన్ని నెలలుగా పెరుగుతూ వచ్చాయి. ప్రస్తుతం రూ.70కి చేరుకొని సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. సహజంగా అనారోగ్యానికి గురైన వారు కొబ్బరి బోండం తాగడానికి ఇష్టపడటంతో పాటు, వైద్యులు కూడా కొబ్బరి బోండం నీరు తాగాలని సూచిస్తున్నారు. ఇటీవల జోరుగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో రోగాలబారిన పడుతున్న సామాన్యులు కొబ్బరి బోడం కొనాలంటే భయపడిపోయో పరిస్థితి నెలకొంది. కొబ్బరి బోండం ధరలు పెరగడానికి ఆంధ్రప్రదేశ్‌తో పాటు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడమే ప్రధాన కారణమని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. అనేక ప్రాంతాల్లో 30నుండి 40 శాతం వరకు దిగుబడి పడిపోవడంతో, డిమాండ్ తగ్గ ఉత్పత్తిలేక ధరలు అమాంతం పెరుగుతున్నట్లు తెలుస్తోంది.

అదే దారిలోనే కొబ్బరి నూనె రేటు

అన్నివర్గాల ప్రజలు అత్యధికంగా వినియోగించే కొబ్బరి నూనె ధరలు అదే పంథాలో నడుస్తున్నారు. గడిచిన కొద్ది నెలల వ్యవధిలోనే 30 శాతానికి పైగా కొబ్బరి నూనె ధరలు పెరిగినట్లు వినియోగదారులు వాపోతున్నారు. గతంలో 500 ఎంఎల్ కొబ్బరి నూనె బాటిల్ ధర రూ.230 ఉండగా, ప్రస్తుతం రూ.300కు చేరింది. వివిధ కంపనీలను బట్టి ధరల్లో కొంతమేర వ్యత్యాసం కనిపిస్తోంది. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ధరల నియంత్రణపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

క్యాన్సర్ నివారణపై అవగాహన ఉండాలి

- కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ

కర్నూలు హాస్పిటల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ నివారణపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీ న్యూ ఆడిటోరియంలో ఎన్‌సీడీ-4.0 క్యాన్సర్ వ్యాధి నివారణపై అర్బన్ హెల్త్ సెంటర్ల మెడికల్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.శాంతికళ అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి బారిన పడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కర్నూలు స్టేట్ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ కృష్ణప్రకాష్ మాట్లాడుతూ క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తించాలని, స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌లో ప్రతి మంగళవారం, గురువారం ఓపీ నెంబర్ 222కు కేసులను పంపాలని సూచించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిపై ఎన్నో అపోహలు ఉన్నాయని, వాటన్నింటిపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మానవ శరీరంలో గోళ్లకు, వెంట్రుకలకు తప్ప శరీరంలోని అన్ని భాగాలకు క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందన్నారు. ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ డా.మహేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని రోగులను గుర్తించి మెరుగైన వైద్యసేవలు అందించడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో సంచార చికిత్స కార్యక్రమ జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ రఘు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ పద్మావతి, ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ సుధాకర్, ఎన్‌సీడీ ఎపిడమాలజిస్టు వేణుగోపాల్, ప్రాజెక్టనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు



వినాయక ఘాట్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలో వచ్చే నెల 4న నిర్వహించనున్న గణేశ్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన మున్సిపల్, పలు శాఖల అధికారులతో కలిసి వినాయక ఘాట్‌ను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ గణేశ్ నిమజ్జనానికి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కేసీ కెనాల్‌కు మరమ్మతు పనులు, ఘాట్‌కు పెయింటింగ్, వేదిక, సౌండ్ సిస్టం, క్రేన్లు, గజ ఈతగాళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ బాబుప్రసాద్, తహసీల్దారు రవికుమార్, ఇన్‌చార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, డీఈఈ గంగాధర్, ఏఈ భాను ప్రకాష్, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అంజాద్‌బాషా, సీఐలు శేషయ్య, హేమంత్ కుమార్‌రెడ్డి, నాగరాజారావు, పార్థసారధి, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, శంకరయ్య పాల్గొన్నారు.

వినాయక చవితిని ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న సీఐ తబ్రేజ్

కోడుమూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రానున్న వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ తబ్రేజ్ అన్నారు. శుక్రవారం రాత్రి స్టేషన్ ఆవరణలో హిందూ ముస్లిం శాంతికమిటీ సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు చేసుకోవాలని, రాత్రి సమయంలో నిర్వాహకులు తప్పకుండా మండపాల వద్ద ఉండాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదన్నారు. ఎస్ఐలు ఎర్రిస్వామి, మణికంఠ, వినాయక, ముస్లిం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సి.బెళగల్: వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ పరమేష్‌నాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని గ్రామాల్లో వినాయక మండపాలను ఏర్పాటు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో చలానా చెల్లించి పోలీసు స్టేషన్లకు అందజేయాలన్నారు.

నగర పాలక డీఈఈగా పవన్‌కుమార్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగర పాలక సంస్థలో పని చేస్తున్న ఏఈఈ పవన్‌కుమార్‌రెడ్డికి తాత్కాలికంగా డీఈఈగా పదోన్నతి కల్పించారు. ఈ మేరకు కర్నూలు నగర పాలక సంస్థకు బదిలీ చేస్తూ పబ్లిక్ హెల్త్ ఇంజనీర్ ఇన్ చీఫ్ ఎం.ప్రభాకర్‌రావు ఉత్త ర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పని చేస్తున్న డీఈఈ మనోహర్ రెడ్డికి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పదోన్నతి పొంది ఇక్కడే పని చేస్తున్నారు. ఖాళీగా ఉన్న స్థానాన్ని భర్తీ చేస్తూ ఈఎన్‌సీ ఉత్తర్వులు జారీ చేశారు. రెండు రోజుల్లో పవన్‌కుమార్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

పీఆర్‌టీయూ నాయకుడికి సన్మానం

సి.బెళగల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.శింగవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీఆర్‌టీయూ నాయకుడు, ఉపాధ్యాయుడు రాజేష్‌కుమార్‌ను ఉపాధ్యాయులు శుక్రవారం శాలువ కప్పి పులమాలలు వేసి సన్మానించారు. రాజేష్‌కుమార్ మాట్లాడుతూ సిబెళగల్ మండల పీఆర్‌టీయూ యూనియన్ అధ్యక్షుడిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్న ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులకు రావాల్సిన డీఏలు, పీఆర్‌సీ, పెండింగ్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయాలని కోరారు. పీఆర్‌టీయూ జనరల్ సెక్రటరీ సురేష్‌కుమార్‌రెడ్డి, క్రిష్ణారెడ్డి, లక్ష్మీనారాయణ, విద్యాసాగర్, దాదామియ్య, గౌడు, చంద్రబాబు, పురుషోత్తం, వెంకన్న, రాజు, రామలక్ష్మి, నాగమ్మ, సుశీలమ్మ పాల్గొన్నారు.

అర్హులందరికీ సూపర్‌సిక్స్ పథకాలు

సి.బెళగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సూపర్‌సిక్స్ పథకాలు అందజేస్తున్నామని కోడుమూరు నియోజకవర్గం జనసేన పార్టీ సమన్వయ కర్త అకెపోగు రాంబాబు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో జనసేన పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం సినీ హీరో చిరంజీవి జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు దస్తగిరి, శ్రీనివాసరెడ్డి, వెంకటరమణ, ఫరుక్ బాషా, ఎల్లప్ప, సోమేష్, బాలచంద్రుడు, నాగరాజు, గోపి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి: సర్పంచ్

కోడుమూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు అమడగుంట్ల సర్పంచ్ వరలక్ష్మీ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లా డుతూ గత వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేక పంచాయతీలు నిర్వీర్యం అయ్యా యని అన్నారు. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక గ్రామపం చాయతీలకు పూర్వవైభవం వచ్చిందన్నారు.

'యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి'

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ ఎ. విజయభాస్కర్, ప్రిన్సిపాల్ ఎస్.ఆంథోని రాజు, వైస్ ప్రిన్సిపాల్ జి.బాబయ్య అన్నారు. శుక్రవారం నగర శివారు జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలోని సెయింట్ మేరీస్ జూనియర్ కళాశాల్లో, ఈగల్ సెల్ కర్నూలు విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈగల్ సెల్ ఎస్ఐ సుజన్‌కుమార్ అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

26న ఎంపిక పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): నగరంలోని డీఎస్ఏ అవుట్‌డోర్ స్టేడియంలో ఈనెల 26న కర్నూలు, నంద్యాల జిల్లాల స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారులకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఎస్ఏ కోచ్ నంద్యాల మహేశ్వర రావు జిల్లా సంఘం అధ్యక్షురాలు రాధిక తెలిపారు. వివరాల కోసం ఫోన్ నెంబరు 9441509619ను సంప్రదించాలని ఆయన సూచించారు.

జగనన్న కాలనీల్లో సమస్యల తిష్ఠ

- కనీస సౌకర్యాలు కరువు
- వర్షం వస్తే రోడ్లన్నీ బురదమయం
- లబోదిబోమంటున్న కాలనీవాసులు



ఓర్వకల్లు జగనన్న కాలనీ లేఅవుట్‌లో నిర్మించిన గృహాలు

ఓర్వకల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలో సమస్యలు తిష్ఠ వేశాయి. మండల కేంద్రమైన ఓర్వకల్లు, నన్నూరు గ్రామాల్లో జగనన్న కాలనీలు ఏర్పాటు చేశారు. ఆయా కాలనీల్లో 808 మందికి పక్కా గృహాలు మంజూరు చేశారు. ప్రభుత్వమే ఇల్లు కట్టించి ఇస్తుందని చెప్పడంతో లబ్ధిదారులు ఎంతో సంతోషపడ్డారు. అయితే. ఇళ్లు మీరే నిర్మించుకోవాలని మాట మార్చడంతో దిక్కుతోచని స్థితిలో ఉండిపోయారు. ఇళ్లు కట్టుకోకపోతే ఇళ్లను రద్దు చేస్తామని అధికారులు ఒత్తిడి చేయడంతో కొంత మంది అప్పులు చేసి నిర్మించుకున్నారు. నన్నూరు గ్రామానికి దూరంలో జగనన్న లేఅవుట్లు వేయడంతో నిర్మాణాలు చేపట్టడం లేదు. జగనన్న కాలనీలో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ మౌలిక సదుపాయలులేక కాలనీవాసులు తల్లడిల్లిపోతున్నారు. తాగునీటి సౌకర్యం కూడా అంతంత మాత్రంగానే ఏర్పాటు చేశారు. కాలనీలో సౌకర్యాలు కల్పించాలని, విద్యుత్ స్థంభాలు ఏర్పాటు చేసినా లైట్లు సక్రమంగా వెలగడం లేదని కాలనీ ప్రజలు తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు లేకపోవడంతో రాత్రిళ్లు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. అయితే రోడ్లు, డ్రైనేజీలు నిర్మించలేదు. ఆ ఫలితంగా వర్షం వస్తే రోడ్లన్నీ బురదతో దర్శనం ఇస్తున్నాయి. కాలనీవాసులు, వాహనదారులు రోడ్లపై తిరగాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి



జగనన్న కాలనీలో రోడ్డు లేకపోవడంతో వర్షం వస్తే నీరంతా రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో రోడ్లన్నీ బురదయమంగా మారుతున్నాయి. వర్షం వస్తే రోడ్లపై తిరగలేము.

● శేషమ్మ, కాలనీవాసి

రోడ్లు నిర్మించాలి



జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తేనే జగనన్న కాలనీకి పురోగతి ఉంటుంది. రాత్రివేళలో బయటకు వెళ్లాలంటే భయమేస్తుంది. కాలనీలో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలి.

● గీతా, కాలనీవాసి

సదుపాయాలు కల్పిస్తాం



ఓర్వకల్లు, నన్నూరు జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. ఈ కాలనీలో తాగునీరు, విద్యుత్ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టి కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తాం.

● శ్రీనివాసులు, ఎంపీడీవో, ఓర్వకల్లు

లక్ష్యాలను సాధించాలి: కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): వివిధ శాఖల అభివృద్ధికి సంబంధించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్ లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ శాఖలకు నిర్దేశించిన కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరంలో ఆయా శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్ల ఆదారంగానే కలెక్టర్ల కాన్ఫరెన్స్ జిల్లా స్థాయి సమీక్ష, మండల స్థాయి సమీక్షలు ఉంటాయన్నారు. ఆయా శాఖల హెడ్ ఆఫీసు నుంచి కీ పెర్ఫార్మెన్స్ ఇండికేటర్స్‌ను జిల్లా లక్ష్యాలను కేటాయించారన్నారు. సమావేశంలో డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్ రాజు, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

కోడుమూరులో బైకు చోరీ

కోడుమూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఓ వ్యక్తికి చెందిన బైకును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేశాడు. బాధితుడి వివరాలివి.. స్థానికంగా రియల్ ఎస్టేట్ ఏజంట్ పార్వార్ బాషా గురువారం రాత్రి స్థానిక న్యూ ఇండియా హోటల్ వద్ద బైక్‌ను ఉంచి మిత్రులతో కలిసి టీ తాగేందుకు వెళ్లాడు. అయితే కొద్దిసేపటి తర్వాత తిరిగి వచ్చి చూడగా బైక్ కనిపిం చలేదు. దీంతో ఆందో ళనకు గురై ఆ పరిసరాల్లో వెతికాడు. చివరకు సమీప సీసీ కెమెరా లను క్షుణ్ణంగా పరిశీలించగా ఓ దుండగుడు చాకచక్యంగా బైక్‌ను స్టార్ట్ చేసుకుని అక్కడి నుంచి ఉడాయించాడు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నిక్షిప్తం కావడంతో బాధితుడు శుక్రవారం పోలీసులను ఆశ్రయించాడు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే గౌరు చరిత



చంద్రబాబుకు సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే గౌరు చరిత

కల్లూరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలు రైతుల తాగు, సాగునీరు అందిం చేందుకు నిధులు విడుదల చేసిన సీఎం చంద్రబాబును పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలిపారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన చాంబర్‌లో సీఎంను కలిసి గోరుకల్లు రిజర్వా యర్‌కు నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. అదేవిధంగా పాణ్యం నియోజకవర్గంలోని పలు అంశాలను ఎమ్మెల్యే సీఎం దృష్టికి తీసుకెళ్లారు. గోరుకల్లు రిజర్వాయర్‌కు నిధులు కేటాయించి తాగు, సాగునీటిని అందించేందుకు మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే సూచించారు. అలగనూరు రిజర్వాయర్ మరమ్మతు, కల్లూరు 16 వార్డుల అభివృద్ధి పనులకు ప్రకటించిన రూ.50 కోట్ల నిధులు మంజూరు చేయాలని సీఎంను కోరారు. ఓర్వకల్లు ఇండ స్ట్రియల్ పార్క్‌లో డ్రోను, సెమీకడక్టర్, ఈవీ పరిశ్రమల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు.

వైభవంగా శ్రీకృష్ణుడి పల్లకీ ఉత్సవం



శ్రీకృష్ణుడిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

ఓర్వకల్లు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన ఓర్వకల్లులో శ్రీకృష్ణుడి పల్లకీ ఉత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞాన వేదిక వారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి ఉత్సవాల్లో భాగంగా ఏడు రోజు స్వామివారి ఉత్సవ మూర్తిని పల్లకిలో అధిష్టించి గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రంగనాథగౌడు, ఓర్వకల్లు, చింతలపల్లి ఉత్సవ కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు పుల్లారెడ్డి, కుమారాచారి, సంజీవ, పార్థసారధి, నాగమద్దిలేటి, పుల్లారెడ్డి, చక్రపాణి, మనోహర్, భాస్కర్, నాగన్న, పార్వతమ్మ, వరలక్ష్మి, రాజేశ్వరమ్మ పాల్గొన్నారు.

నేడు కేవీఆర్ కళాశాలలో టంగుటూరి జయంతి

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రరాష్ట్ర తొలి ముఖ్య మంత్రి, ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకను శనివారం ఉదయం 10 గంటలకు నగరంలోని కేవీఆర్ ప్రభుత్వ మహిళా కళాశాల్లో ఏర్పాటు చేసినట్లు సాహిత్య సంస్థ అధ్యక్షుడు కురాడి చంద్రశేఖర కల్కూర ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ సదస్సు సంస్థ, క్లస్టర్ విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ ప్రారంభోపన్యాసం చేస్తారని, ముఖ్య అతిథిగా రాయలసీమ, క్లస్టర్ విశ్వవిద్యాలయాల ఉపకులపతి ఆచార్య వి.వెంకట బసవరావు, ముఖ్యవక్తగా విజయవాడ ఆంధ్ర లయోలా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మువ్వా శ్రీనివాసరెడ్డి హాజరవుతారని తెలిపారు. విశిష్ట అతిథిగా క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు పాల్గొంటారని తెలిపారు. ఆత్మీయ అతిథి సందేశం అఖిల భారత బ్రాహ్మణ కరివేణ నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ ఐ.వేణుగోపాల్ ఇస్తారని కేసీ కల్కూర వివరించారు.

క్రీడాకారిణికి టీజీ అభినందన

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బీహార్ రాష్ట్రంలో ఈనెల 9, 10 తేదీల్లో జరిగిన ఏసియా అండర్-20 రగ్బీ చాంపియన్ షిప్‌లో కాంస్య పతకం సాధించిన క్రీడాకారిణి ఎన్ఎస్ అక్షయకు ఘన సత్కారం లభించింది. శుక్రవారం రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ తన చాంబరులో ఆహ్వానించి ఆమెకు నగదుతో పాటు శాలువ, పూలబొకే అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రామాంజనేయులు, గుడిపల్లి సురేందర్, కోశాధికారి కొండెపోగు చిన్న సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికలు క్రీడల్లో రాణించాలి



బహుమతులు ప్రదానం చేస్తున్న డాక్టర్ శంకర్‌శర్మ

కర్నూలు స్పోర్ట్స్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): బాలికలు క్రీడల్లో రాణించాలని సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకర్‌శర్మ అన్నారు. శుక్రవారం ఆదర్శ విద్యామందిర్ మైదానంలో ఏర్పాటు చేసిన అస్మిత రగ్బీ లీగ్ పోటీల బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడాకారులు గెలుపు ఓటములు సమానంగా స్వీకరించాలన్నారు. అనంతరం రగ్బీ లీగ్ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర రగ్బీ సంఘం ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా అధ్యక్షుడు సురేంద్ర, ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు



పూజలు చేస్తున్న మహిళలు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసం చివరి శుక్రవారం సందర్భంగా నగరంలోని వివిధ అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్లూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి గాజులతో, విభిన్న రకాల పూలతో అలంకరించి పూజలు చేశారు. జి.పుల్లారెడ్డి కళాశాల వెనుక గల విజ్ఞాన పీఠం పాఠశాల్లో మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఆచరించారు. పంచాంగ కర్త వారణాసి వెంకట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో లక్ష్మీదేవి అమ్మవారికి సామూ హిక కుంకుమార్చనలు నిర్వహించారు. కార్యక్రమానికి రేణుక, హరిప్రియ, మధులక్ష్మీ, శిరీష, సునీత, శిరీష, నాగమణి, రమణమ్మ పూజలకు సహకారం అందించారు. కార్యక్రమంలో బి.తాండ్రపాడు, టీజీవీ కాలనీ, టీవీ9 కాలనీలకు చెందిన మాతృమూర్తులు, విద్యార్థినులు, భక్తులు పాల్గొన్నారు. నగరంలో సప్తగిరినగర్‌లోగల మణికంఠ అయ్యప్ప ఆలయం ఆవరణలోని చౌడేశ్వరి దేవి మాత ఆలయంలో అమ్మవారికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అర్చనలు చేశారు.

దివ్యాంగుల సర్టిఫికెట్లు పొందితే దొంగలా?

వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల సర్టిఫికెట్ పొందితే దొంగలుగా కూటమి ప్రభుత్వం చిత్రీకరించడం అన్యాయమని వైసీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం ఎస్వీ కాంప్లెక్స్‌లోని సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏడాదిలో 4 లక్షల 30 వేల పింఛన్లు రద్దు చేశారన్నారు. దివ్యాంగుల సర్టిఫికెట్లలో పర్సెంటేజీ శాతాన్ని తగ్గించాలని వైద్యులకు ప్రభుత్వం టార్గెట్ చేస్తుందని విమర్శించారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. డీఎస్సీ మెరిట్ లిస్టు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిం చారు. పీ4 స్పాన్సర్ల కోసం ఉద్యోగులపై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. మంత్రులు పీ4 కింద ఎంత మందిని దత్తత తీసుకున్నారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నగర పాలక స్టాండింగ్ కమిటీ సభ్యులు ఎస్‌టీ.షేక్ అహ్మద్, వైసీపీ నాయకులు తిరుమలేశ్వరరెడ్డి, కిషన్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ తొలగించడం అన్యాయం

కర్నూలు న్యూసిటీ, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌ను తొలగించడం అన్యాయమని సీపీఎం నాయకుడు పార్వతయ్య అన్నారు. శుక్రవారం నగర పాలక కార్యాలయంలో తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ మేనేజర్ చిన్నరాముడుకు వినతి పత్రం అందజే శారు. పార్వతయ్య మాట్లాడుతూ దివ్యాంగుల పింఛన్ ఏ రకంగా కోతపెడతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి పింఛన్లు ఇవ్వడానికి చేతకాకనే రద్దు చేశారని ఆరోపించారు. నగరంలో పింఛన్ కోల్పోయిన వారంతా ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర కార్యదర్శివర్గసభ్యుడు ఎండీ షరీఫ్, జావిద్, శుక్లాజీరావు, జగదీష్, రాములమ్మ, నాగమద్దమ్మ పాల్గొన్నారు.

దివ్యాంగుల కడుపు కొడుతున్న ప్రభుత్వం

కర్నూలు అర్బన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దివ్యాంగుల కడుపు కొడుతోందని సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సదరం క్యాంపులు నిర్వహించి ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో పరీక్షించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తే, కూటమి ప్రభు త్వం రీ వెరిఫికేషన్ పేరుతో 35 నుంచి 40 సంవత్సరాలుగా తీసుకుం టున్న పింఛన్ తొలగించడం సరికాదన్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జోక్యం చేసుకుని తొలగించిన పింఛన్లను పునరుద్ధరించాలని కోరారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): సినీ నటుడు, మాజీ కేంద్ర మంత్రి చిరంజీవి జన్మదిన వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ రాయలసీమ జోనల్ కన్వీనర్, మార్కెట్ యార్డు డైరెక్టర్ పవన్ కుమార్ ఆధ్వర్యంలో నగరంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఈ వేడుకలు జరిగాయి. పవన్‌కుమార్ కేక్‌ను కట్‌చేసి జనసేన నాయకులు, కార్యకర్తలు, చిరు అభిమానులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో రోపా సంస్థ ప్రతినిధి రామకృష్ణ పాల్గొన్నారు.

మంత్రి ఆదేశాలను అమలు చేస్తాం

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): రైతులకు గిట్టుబాటు ధర అందించేలా చర్యలు తీసుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ ఆదేశించారని, ఆయన ఆదేశాలను కచ్చితంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని కర్నూలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి తెలిపారు.. శుక్రవారం కర్నూలు నగరంలోని మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పక్క జిల్లాలు, పక్క రాష్ట్రాల నుంచి రైతులు పంట ఉత్పత్తులను కర్నూలు మార్కెట్ యార్డుకు రైతులు తెస్తున్నా రని, వారికి గిట్టుబాటు ధర అందించేందుకు కృషి చేస్తామన్నారు. యార్డులో ప్రతి కమీషన్ ఏజెంటుకు షాపు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నూతన బైక్‌ల ఆవిష్కరణ



నూతన బైకును ఆవిష్కరిస్తున్న రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శౌర్య హోండా షోరూమ్ వారు నూతన ద్విచక్ర వాహనాలు మార్కెట్లోకి విడుదల చేయడం అభినందనీయమని రాజ్యసభ మాజీ సభ్యుడు టీజీ వెంకటేశ్ అన్నారు. నగరంలోని సి.క్యాంపులోని శౌర్య హోండా షోరూమ్ ఆధ్వర్యంలో రెండు నూతన ద్విచక్ర వాహనాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, జోనల్ హెడ్ శరత్, ఏరియా ఇన్‌చార్జిలు ప్రజ్వల్ గంగ్వార్, వినోద్‌కుమార్, కార్పొరేటర్ కె.పద్మలతారెడ్డి, శౌర్య హోండా షోరూమ్ అధినేత కె.విశ్వమోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు సినీ గాయకులు రేణుకుమార్, కృష్ణ లాస్యలు పాటలతో సందడి చేశారు.

సామాజిక సేవలు ప్రశంసనీయం

కర్నూలు కల్చరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కల్లూరులోని ఫొటో, వీడియోగ్రాఫర్లు గత 13 ఏళ్లుగా చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ప్రశంసనీయమని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని కల్లూరు ఫొటో, వీడియో గ్రాఫర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే బాషా ఆధ్వర్యంలో అసోసియేషన్ ప్రతి నిధులు కలెక్టర్ పి.రంజిత్ బాషాను మర్యాదపూర్వకంగా కలిసి, శాలువతో సత్కరించి, పూల మొక్క అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్కే బాషా, అక్కెం విశ్వనాథం, మల్లికార్జున, సుధాకర్, శ్రీనివాసులు, సురేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

రైతులకు సాగునీరు అందించాలి

కర్నూలు అగ్రికల్చర్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలంలోని మార్కాపురం గ్రామంలో రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మించిన చిన్నరాయన తిప్ప రిజర్వాయరుకు తక్షణమే నీళ్లు నింపి రైతులకు సాగునీరు అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, సహాయ కార్యదర్శి ఏ.కృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం కర్నూలు నగరంలోని జలమండలి కార్యాలయ అధికారికి రాయనతిప్ప రిజర్వాయరును నీటితో నింపాలని వినతి పత్రం సమర్పించారు.

సమస్యలు పరిష్కరించాలి

సి.బెళగల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరారు. శుక్రవారం సి.బెళగల్‌లోని సచివాలయం 2లో ప్రజాఫిర్యాదుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్డీవో సందీప్‌కుమార్ హాజరై రైతుల నుంచి వినతులను స్వీకరించారు. ఆర్డీవో మాట్లాడుతూ జాయింట్ ఎల్‌పీఎం నంబర్లు లింక్ కావడం లేదని, దీంతో పింఛన్లు, తల్లికివందనం రావడంలేదు తమకు విన్నవించారన్నారు. కార్యక్రమానికి 138 దర ఖాస్తులు వచ్చాయన్నారు. తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాణెమ్మ, జిల్లా సర్వేయర్ సుబ్బారెడ్డి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్వేయర్ నాగభూషణం, ఆర్ఐ తరుణ్ పాల్గొన్నారు.

మాంటిస్సోరిలో కృష్ణాష్టమి సంబరాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరంలోని ఏక్యాంప్‌లో ఉన్న మాంటిస్సోరీ విద్యా సంస్థలో శుక్రవారం కృష్ణాష్టమి సంబరాలు కోలాహలంగా సాగాయి. చిన్నారులు గోపిక, శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సాగిన ఈ వేడుకల్లో చిన్నారులతో పాటు తల్లిదండ్రులు, టీచింగ్ సిబ్బంది నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్ ఈ వేడుకలకు హాజరయ్యారు.



డ్రైనేజీలు నిర్మించాలి



చిత్తడిగా మారిన ప్రధాన రహదారి

ఆస్పరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగరూరు గ్రామంలో డ్రైనేజీలు లేక వర్షపు, వృథా నీరు రోడ్లపై నిలిచిపోతున్నాయి. గ్రామంలో ఈ రోడ్డుగుండా వెళ్లేందుకు వృద్ధులు, చిన్నారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ఆస్పరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి పండగ సందర్భంగా ఏర్పాటు చేసుకునే మండపాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా పొందాలని సీఐ గంగాధర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండపాల్లో సీసీ కెమెరాలు ఉంచాలని, రెచ్చగొట్టే ఫ్లెక్సీలు, డీజే సౌండ్లను నిషేధించామన్నారు. మండపాల నిర్వాహకులు అందుబాటులో ఉండాలని సూచించారు.

బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నాగేష్, శ్రీనివాసులు



మద్దికెర ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకులు సుంకర నాగేష్, చాకలి శ్రీనివాసులును జిల్లా బీజేపీ కార్యవర్గ సభ్యులుగా నియమించినట్లు బీజేపీ జిల్లా అధ్యక్షులు రామకృష్ణ ఉత్తర్వులు పంపినట్లు మండల బీజేపీ అధ్యక్షులు బురుజుల శంకర్‌బాబు శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ బీజేపీ బలోపేతానికి కోసం కృషి చేస్తామని తెలిపారు.

పంట నమోదు చేస్తేనే పథకాలు



పంట నమోదు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది

మద్దికెర ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈక్రాఫ్ నమోదు చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. శుక్రవారం మం డలంలోని మద్దికెర, ఎం.అగ్రహారం గ్రామాల్లో ఈక్రాఫ్ బుకింగ్ చేశారు. ఆయన మాట్లాడుతూ బ్యాంకు ఖాతాకు రైతులు ఆధార్ తప్పనిసరిగా లింక్ చేసుకోవాలన్నారు. క్రాఫ్‌ను ప్రతి రైతు నమోదు చేసుకోవాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు ఆనంద్, తదితరులు ఉన్నారు.

సారా విక్రయిస్తే చర్యలు



గిరిజనులతో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

తుగ్గలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నాటు సారా తయారు చేసినా, అమ్మినా అదే వృత్తిని ఎంచుకుంటే చర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం రోళ్లపాడు తాండ, తదితర గిరిజన తాండల్లో పర్యటించారు. అనంతరం గిరిజనులతో ఆయన మాట్లాడుతూ బతకడానికి సారా తయారు చేసేందుకు వృత్తిగా ఎంచుకోకూడదని, ఏదైనా పని చేసుకుని జీవనం సాగించాలని, అలా కాకుండా సంపాదనే లక్ష్యంగా, సారా అమ్మడం, తయారు చేయడం చేపడితే.. చర్యలు తీసుకోవడంతో పాటు పీడీ యాక్టు నమోదు చేసి జిల్లా బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట ఎక్సైజ్ సీఐ స్వర్ణలత, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, ఎక్సైజ్ ఎస్ఐ సాయి తేజ్ తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందిస్తాం

తుగ్గలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలకు వచ్చిన ప్రతి ఒక్కరికి వైద్యసేవలు అందిస్తామని వైద్యురాలు రోజారమణి అన్నారు. శుక్రవారం తుగ్గలి ప్రభుత్వ వైద్యశాలలో మహిళా వైద్యురాలుగా బాధ్యతలు తీసుకున్నారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

క్రీడల్లో రాణించాలి



రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్‌కు ఎంపికైన విద్యార్థులు

తుగ్గలి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సాధన విద్యానికేతన్ డైరెక్టర్ భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తుగ్గలి సాధన విద్యానికేతన్‌కు చెందిన నలుగురు విద్యార్థులు అండర్-10 విభాగంలో చరణ్, బి.రాజ్, ఐశ్వర్య అండర్-14 విభాగంలో అరవింద్ రోప్ స్కిప్పింగ్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడం ఎంతో సంతోషకరమని ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు.

తలారి మృతి



అయ్యన్న (ఫైల్)

వెల్దుర్తి, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లగుమ్మి గ్రామానికి చెందిన తలారి బోయ అయ్యన్న గురువారం రాత్రి మృతి చెందాడు. 25 ఏళ్ల నుంచి రెవెన్యూ సహాయకుడు(తలారీ)గా పనిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ చంద్రశేఖరవర్మ,వీఆర్ ఏల సంఘం నాయకులు అయ్యస్వామి, ఉస్మాన్ బాషా, మద్దయ్య గ్రామానికి చేరుకొని పార్థీవదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంత్యక్రియల నిమిత్తం రూ.25 వేలు అందజేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో ఎల్లకృష్ణ, విఆర్ఏలు పాల్గొన్నారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే..



పలకలు అందజేసిన ఉపాధ్యాయుడు

మద్దికెర ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఉచితంగా పలకలు, కంబాక్స్‌లు ఇస్తున్నామని ఉపాధ్యాయులు ఎన్‌జీ నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని హంపా గ్రామంలో పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు తన సొంత డబ్బు వెచ్చించి 1, 2 తరగతుల్లో చదువుకుంటున్న 35 మంది విద్యార్థులకు పలకలు, బాక్స్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లీలావతి విద్యార్థులు ఉన్నారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరులో జాప్యం

దరఖాస్తుదారుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం

దేవనకొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ధ్రువీకరణ పత్రాల మంజూరులో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల కోసం గ్రామ సచివాలయలలో దరఖాస్తు చేసుకున్నారు. సమయానికి వీఆర్వోలు, ఆర్ఐ అందుబాటులో ఉండడం లేదని, వారి లాగిన్‌లో ఒకే చేసినా దరఖాస్తుపై తహసీల్దార్ సంతకమంటూ కాలయాపన చేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎస్సీ అభ్యర్థుల మార్కుల జాబితా ఈనెల 11న విడుదలైంది. అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం కోసం దరఖాస్తు చేసుకొని పది రోజులైనా మంజూరు కాకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. డీఎస్సీ అభ్యర్థులు ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి, నిర్ధేశించిన సమయంలోగా ధ్రువపత్రాలతో హాజరు కావాల్సి ఉంది. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాము ఇబ్బంది పడుతున్నామని లబ్ధిదారులు బోదిబోమంటున్నారు.

పదిరోజులైన పట్టించుకోవడం లేదు

11వ తేదీన డీఎస్సీ మార్కుల జాబితా వెలువడడంతో 12 న కుల ధ్రువీకరణపత్రం కోసం దరఖాస్తు చేసుకున్నా. గత పది రోజులుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. కార్యాలయ సిబ్బందిని అడిగితే నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. శనివారం లోగా ధ్రువీకరణ పత్రం ఇస్తే అటెస్టెడ్ చేసుకోవాలి.

● అశోక్, కుంకనూరు

డిజిటల్ కీ లేదు,

బుధవారం ఇన్‌చార్జీ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టాను. డిజిటల్ కీ రాలేదు, వస్తేనే దరఖాస్తులను పూర్తి చేస్తాం.

● అమీనా బేగం ఇన్‌చార్జి తహసీల్దార్

నిరుపయోగంగా ఎస్సీ హాస్టల్ భవనం

● అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం



మద్దికెర గ్రామంలో ఉన్న ఎస్సీ హాస్టల్ ఇదే

మద్దికెర ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మద్దికెర గ్రామంలోని రైల్వేస్టేషన్ సమీపాన విశాలమైన స్థలంలో రూ.80 లక్షలతో గత ఏడేళ్ల క్రితం అత్యంత సుందరంగా ఎస్సీ హాస్టల్ బాలుర వసతి గృహాన్ని నిర్మించారు. మండల కేంద్రం నుంచి కాకుండా ఇతర గ్రామాల నుంచి దాదాపు 200 మంది దాకా విద్యార్థులు హాస్టల్ సీటు సంపాదించి చదువుకునే వారు. విద్యార్థుల సౌకర్యార్థం ఎస్సీ హాస్టల్‌ను దాదాపు 12 గదులను నిర్మించడమే కాకుండా విద్యార్థులకు ఐదు మరుగుదొడ్లు, ఐదు స్నానపు గదులను కట్టించారు. ఏదీ ఏమైందో తెలియదు గానీ అయితే.. ఉన్నట్టుండి ఎస్సీ హాస్టల్‌ను మూసేశారు. దీంతో గ్రామంలో ఆ భవనం గ్రామ శివారులో ఉండడంతో అవి కాస్త అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రాలుగా మారాయి. ఎస్సీ హాస్టల్ గదులను ఏదో ఒక దానికి వినియోగించుకోవాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలో 11 గ్రామాలు ఉన్నాయని, హాస్టల్ పునఃప్రారంభిస్తే విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. జిల్లా అధికారులు స్పందించి ఈ హాస్టల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

ఎస్సీ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి



మండలంలో ఎంతో మంది ఎస్సీ విద్యార్థులు ఉన్నారని, హాస్టల్‌ను పునఃప్రారంభించడం వల్ల విద్యార్థులకు విద్య అందుతుంది. అధికారులు స్పందించి హాస్టల్‌ను వెంటనే ప్రారంభిచాలి

-వెంకటేశ్వర్లు, మద్దికెర

పింఛన్లు పునరుద్ధరించే వరకు పోరాటం ఆగదు

● ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

ఆలూరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛన్లను తొలగించడం అన్యాయమని, తిరిగి పింఛన్లు పునరుద్ధరించేవరకు పోరాటం ఆగదని ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి అన్నారు. శుక్రవారం ఆలూరులోని అంబేడ్కర్ కూడలిలో దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షులు రామాంజినేయులు ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఎమ్మెల్యే మద్దతు ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే పింఛన్లు పెంచుతామని, అర్హులైన వారందరికీ కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చి అనర్హుల పింఛన్ల ఏరివేత కార్యక్రమం ద్వారా అర్హులైన దివ్యాంగుల పింఛన్లు తొలగించడం సరైన నిర్ణయం కాదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు దొరబాబు, రామకృష్ణ, వైసీపీ మండల కన్వీనర్లు మారయ్య, మల్లికార్జున, బసవరాజు, నాయకులు భాస్కర్, లుముంబా, బాష, వెంకటేశ్వర్లు, భాస్కర్, వీరేష్, గౌడప్ప, జాన్, మల్లికార్జున, కురువల్లి శివ, కిషోర్, ఉరుకుంద, సోమశేఖర్, నాగేష్, దివ్యాంగుల సంఘం నాయకులు ఈరన్న, రాజు, నాయక్ పాల్గొన్నారు.

తుగ్గలి: దివ్యాంగుల పింఛన్లు ప్రభుత్వం తొలగించడం అన్యాయమని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్‌యాదవ్, జడ్పీటీసీ సభ్యుడు పులికొండ నాయక్ అన్నారు. శుక్రవారం జి.ఎర్రగుడిలో వారు మాట్లాడుతూ దివ్యాంగుల ఉసురు కూటమి ప్రభుత్వం తలుగుతుందన్నారు. 90 శాతానికి పైగా అంగవైకల్యం ఉన్న వారికి 40 శాతం కంటే తక్కువగా ఉందని, సదరం క్యాంపులో సర్టిఫికెట్లు అందజేసి పింఛన్లు తొలగించడం అమానుషమన్నారు. వెంటనే తొలగించిన పింఛన్లను పునరుద్ధరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ సభ్యులు నారాయణ్ నాయక్, తదితరులు ఉన్నారు.

పత్తికొండ టౌన్: వెరిఫికేషన్ పేరుతో అక్రమంగా తొలగించబడిన వికలాంగుల పింఛన్లను యదావిధిగా కొనసాగించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాసాహెబ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో ఎంపీడీవో కవితకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు రామాంజినేయులు, కాశీ, గిడ్డయ్య, నెట్టికంటయ్య, రంగన్న, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

టీబీని అంతమొందించడమే లక్ష్యం

ఆదోని టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : దేశంలో 2027 సంవత్సరంలోగా టీబీ వ్యాధిని శాశ్వతంగా అంతమొందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా కృషి చేస్తున్నాయని ప్రభుత్వ టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శేఖన్ బాను అన్నారు. శుక్రవారం స్థానిక పీఎన్ రోడ్డు ప్రాంతంలో ఏర్పాటు చేసిన టీబీ ముక్త భారత్ ప్రోగ్రాం కార్యక్రమంలో డాక్టర్ శేఖన్ బాను మాట్లాడారు. టీబీ వ్యాధి నిర్ధారణ జరిగితే ఆరు నెలలపాటు క్రమం తప్పకుండా ప్రభుత్వం ఉచితంగా అందించే మందులు వాడితే పూర్తిగా నయమవుతుందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు బాబురాజు, చంద్ర శేఖర్, జ్ఞానేశ్వరి వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది సుబ్బమ్మ బాయి, ఆశ వర్కర్లు లక్ష్మీ దేవమ్మ, ధనలక్ష్మి, అరుణ జ్యోతి, నీలమ్మ పాల్గొన్నారు.

కుడా చైర్మన్ సోమిశెట్టికి సన్మానం



సోమిశెట్టిని సన్మానిస్తున్న నాయకులు

పత్తికొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు పత్తికొండ ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఓకార్యక్రమంలో పాల్గొనేందుకు పత్తికొండకు వచ్చిన సోమిశెట్టిని టీడీపీ కార్యాలయంలో ఆర్యవైశ్యసంఘంనాయకులు కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్యసంఘం నాయకులు రామచంద్రయ్య, సత్యనారాయణ, గోపాలయ్య, సుమంత్, మహేశ్, రాజేష్ తదితరులు ఉన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

పత్తికొండ, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రాణదానంతో సమానమని జనసేన ఇన్‌చార్జి రాజశేఖర్ అన్నారు. పత్తికొండలో శుక్రవా రం చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకుని జాతీయ చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడు వైపీ క్రాంతికుమార్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. నాయకులు గల్లారామచంద్ర, వడ్డెజయరాముడు, రామక్రిష్ణ, వీరేష్, కర్ణంరవి, ఇస్మాయిల్ చేశారు.

టీడీపీ నాయకుడి ఔదార్యం

హొళగుంద, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎల్లార్తి షేక్షావలి, షాషా వలి సాహెబ్‌ల దర్గాకు వచ్చే భక్తుల కోసం తాగునీటి సౌకర్యం కల్పించినట్లు టీడీపీ నాయకుడు కురువ బందప్ప శుక్రవారం తెలిపాడు. ఆయన మాట్లాడుతూ మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటక నుంచి భక్తులు వస్తుంటారన్నారు. భక్తుల కోసం దర్గా వద్ద 10 వేల లీటర్ల సింటెక్స్ ఏర్పాటు చేసి తాగునీటి కొళాయి కనెక్షన్ ఇచ్చినట్లు తెలిపారు. భక్తులకు తాగునీరు ఏర్పాటు చేయడం పట్ల టీడీపీ నాయకులు, గ్రామస్థులు బందప్పాను అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గడ్డం దర్గాన్న, వాసీం పాల్గొన్నారు.

'స్త్రీ శక్తి'కి మంచి ఆదరణ

హాలహర్వి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్త్రీ శక్తి పథకం వల్ల ప్రజల్లో మంచి ఆదరణ లభించిందని టీడీపీ సీనియర్ నాయకులు రమేష్ అన్నారు. శుక్రవారం హాలహర్విలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్ పథకాలు అమల్లో భాగంగా ఈ పథకం మహిళలకు ఎంతో ఆర్థిక భరోసా కల్పించిందన్నారు. మహిళలు ఉచిత బస్సు పథకం ద్వారా ప్రభుత్వంపై మంచి ఆదరణతోపాటు ఊహించని రీతిలో కొనియాడుతున్నారని, టీడీపీ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తి స్థాయిలో ముందంజలో ఉందన్నారు. ఈ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి కార్యకర్తలంతా కలిసికట్టుగా పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

అక్రమంగా గరుసు తవ్వకాలు చేస్తే చర్యలు తీసుకుటాం



మాట్లాడుతున్న తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి

ఆస్పరి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రభుత్వ భూములు, కొండలు, గుట్టలు అక్రమంగా గరుసు తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రామేశ్వర్‌రెడ్డి, సీఐ గంగాధర్ అన్నారు. చిగిలి గ్రామ కొండలో అక్రమంగా గరుసు తవ్వకాలు చేసి ఎక్కడ పడితే భారీగా గుంతలు తవ్వారని, గత మూడు వారాలుగా భారీగా కురిసిన వర్షాలకు ఆ గుంతలో వర్షపునీరు చేరడంతో ఆరుగురు విద్యార్థులు ఈతకు వెళ్లి మృత్యువాత పడ్డారన్నారు. గ్రామాల్లో అక్రమంగా గరుసు తవ్వకాలు చేపడితే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాఆచరం ఇచ్చిన వ్యక్తుల పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు వారి పిల్లలను పాఠశాల వదిలిన వెంటనే ఎక్కడికి వెళ్తున్నారో వారిపై శ్రద్ధ ఉంచాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

ఆదోని టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎర్రమట్టిని తవ్వకాలు చేపట్టేవారిపై చర్యలు తీసుకోవాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఆస్పరి మండలంలోని చిగిలి గ్రామంలో ఆరుగురు చిన్నారుల మృతికి నీటి గుంటనే కారణమన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో అడ్డదిడ్డంగా తవ్వకాలు చేపడడంతో గుంతలు ఏర్పాడ్డయన్నారు. అనుమతులు లేకుండా తవ్వకాలు చేపడుతున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మృతి చెందిన చిన్నారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

రైతుల వివరాలతో ఎరువులు విక్రయించాలి



మద్దికెరలో రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్ గూండాల్ నాయక్



తుగ్గలిలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ రవి, ఏవో సురేష్ యాదవ్

మద్దికెర ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎరువుల దుకాణాల యజమానులు రైతుల పూర్తి వివరాలతో ఎరువులు విక్రయించి, రికార్డులో పొందుపరచాలని తహసీల్దార్ గూండాల్ నాయక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆ ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఎరువుల దుకాణాల యజమానులు యూరియా కొరత లేకుండా ఎరువులు విక్రయించాలని తెలిపారు. ఒక్కొక్క పాసు పుస్తకానికి 3 నుంచి 5 బస్తాల యూరియా మాత్రమే ఇవ్వాలని తెలిపారు. రైతులు ఎరువులు తీసుకుని వెళితే.. వారి ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు రికార్డుల్లో నమోదు చేసుకోవాలన్నారు. ఎరువుల దుకాణాల యజమానులు ధరలను నోటీసు బోర్డులో పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు రంగస్వామి, రషీదు, వీఏఏ ఆనంద్, దుకాణ యజమాని భీమలింగప్ప తదితరులు ఉన్నారు.

తుగ్గలి: రాష్ట్ర ప్రభుత్వం అందించే యూరియా, ఎరువును రైతులు వారి పొలానికి తగ్గ యూరియాను మాత్రమే తీసుకోవాలని తహసీల్దార్ రవి, ఏవో సురేష్ యాదవ్ తెలిపారు. శుక్రవారం మండలానికి వచ్చిన యూరియా స్టాక్‌ను వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ మండలంలో ఐదు రైతు సేవా కేంద్రాల్లో యూరియా స్టాక్‌లు ఉన్నాయని, వాటిని ప్రతి రైతుకి అందిస్తామన్నారు. అధిక మోతాదులో యూరియా వాడడం వల్ల ఎలాంటి ఉపయోగం లేదన్నారు. అలాగే ప్రతి రైతు నానో యూరియాను, 225 లీటర్లను, ఒక ఎకరాకు సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు మల్లేష్, లక్ష్మి నారాయణ రైతులు ఉన్నారు.

ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయుడు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని ఏపీ నర్సింగ్ స్టూడెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ నాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం ముఖ్యనాయకుల సమావేశం డివిజన్ అధ్యక్షుడు కాజా మోహినుద్దీన్ ఆధ్వర్యంలో జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎంతో మంది విద్యార్థినీ, విద్యార్థులు స్వయం ఉపాధి పొందే నర్సింగ్ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సులు చేయాలని ఆశపడుతున్నారన్నారు. ఇక్కడ ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో లేకపోవడంతో కర్నూలుకు వెళ్లి చదువుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వ మూరాక పనులు అర్థాంతరంగా ఆపేసిందన్నారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ముజీబాషా, రాహుల్ పాల్గొన్నారు.

పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగ సంఘం నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు వేతన సవరణ కమిషన్(పీఆర్‌సీ) నియామకంపై స్పష్టత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు బంగి శ్రీధర్, ఆదోని తాలూకా అధ్యక్షుడు రషీద్ కోరారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ 11వ పీఆర్‌సీ గడువు ముగిసి రెండేళ్లు పైగా కావస్తున్న 12వ పీఆర్‌సీ చైర్మన్ నియమకం పై ప్రభుత్వ నిర్లక్ష్యం చేస్తుందన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. పీఆర్‌సీ ఆలస్యం అయితే ఉద్యోగులకు తాత్కాలిక ఉపశమనం కోసం 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న జీపీఎఫ్ బిల్లులు, డీఏలను చెల్లించాలని కోరారు. గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు వారిన మాతృసంస్థలో కలిపి జూనియర్ అసిస్టెంట్ సమానంగా పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘ నాయకులు లక్ష్మీనాగ రవి, తిరుమలేశు, రాధాకృష్ణ, లక్ష్మీదేవి, దేవోజీ పాల్గొన్నారు.

వేరుశనగ దిగుబడులను గ్రేడింగ్ చేయకుండా కొనుగోలు చేయాలి



మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పనకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆదోని అగ్రికల్చర్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో రైతులు విక్రయానికి తెచ్చిన వేరుశనగ దిగుబడులను వ్యాపారులు గ్రేడింగ్ లేకుండా కొనుగోలు చేసేలా చూడాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశులు కోరారు. శుక్రవారం ఆయన రైతులతో కలిసి మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎం.కల్పనకు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి వచ్చిన అరకొన దిగుబడిని విక్రయానికి తెస్తే వ్యాపారులు పాసింగ్ చేసి రైతులను తీవ్రంగా నష్టపరుస్తున్నారన్నారు. వ్యాపారుల ప్లాట్‌ఫాం పై ఉన్న వేరుశనగ రాశులను మహిళా కూలీలతో పలుచగా పరిచి మట్టి ధూళి రాళ్లు అంటూ గ్రేడింగ్ చేయడం అన్యాయమన్నారు. ఏ వ్యవసాయ మార్కెట్ కమిటీలలో లేని ఈ సంప్రదాయాన్ని ఇక్కడే వేరుశనగ వ్యాపారులు కొనసాగిస్తున్నారని, వెంటనే ఈ విధానాన్ని అడ్డుకొని రైతులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు. 25 నుంచి పాసింగ్ విధానాన్ని రద్దు చేస్తున్నామని, రైతులు ఇంటి వద్దనే గ్రేడింగ్ చేసుకొని తీసుకురావాలని మార్కెట్ యార్డ్ కార్యదర్శి కల్పన తెలిపారు. రైతు సంఘం నాయకులు లింగన్న, ఉచ్చిరప్ప పాల్గొన్నారు.

వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిద్దాం

ఆదోని టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వినాయక ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహిద్దామని ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి గోరంట్ల రమణ అన్నారు. విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గణేశ్ మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వినాయక నిమజ్జనం రోజున ప్రభుత్వ అధికారుల సహకారంతో ఎలాంటి అవాంతరాలు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. జిల్లా ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులుగా ఆదోని పట్టణానికి చెందిన విట్టా రమేష్, బసవన్న గౌడ్, కార్యదర్శులుగా మలేకర్ శ్రీనివాస్, శ్రీనివాస ఆచారి, మమత లోకేష్ ఎన్నికైనట్లు తెలిపారు.



ఉత్సవ కమిటీ సభ్యులుగా ఎంపికైన వారు..

దివ్యాంగుల దిగాలు

- మార్చిన నిబంధనలతో పింఛన్ కోల్పోయిన వందలాది మంది దివ్యాంగులు
- కార్యాలయాల చుట్టూ తిరగలేక అవస్థలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు



ఇన్‌చార్జి ఎంపీడీవో అనంతశయనతో వాగ్వాదానికి దిగిన దివ్యాంగులు

గోనెగండ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు సదరం సర్టిఫికెట్లను రీవెరిఫికేషన్ పేరుతో వికలాంగత్వ పర్సంటేజిని తక్కువ చూపి పింఛన్‌లకు అర్హత లేకుండా చేస్తున్నారని దివ్యాంగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉన్న సదరం సర్టిఫికెట్‌లో వంద శాతం వికలాంగత్వం ఉన్నట్లు చూపితే మరి గత నెలలో చేసిన రీ వెరిఫికేషన్‌లో 28 శాతానికి పడిపోయిందని పింఛన్ రద్ద చేస్తున్నట్లు నోటీసులను దివ్యాంగులకు అందజేస్తున్నారు. పనులు చేయలేక పింఛన్‌పై ఆధారపడి జీవనం సాగించే వారికి ఇదో శరాఘాతంగా మారిందని ఆసంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. గోనెగండ్ల మండల వ్యాప్తంగా 1249 దివ్యాంగ పింఛన్‌లు ఉన్నాయి అందులో దాదాపు 500 మందికి నోటీసులు వచ్చినట్లు తెలుస్తుంది.

దివ్యాంగుల పింఛన్ నుంచి వృద్ధాప్య పింఛన్‌కు మార్చారు

ఈ నోటీసులలో మరో మాయ కూడా ఉంది. కొంతమంది దివ్యాంగులకు నోటీసులు ఇచ్చిన వాటిలో దివ్యాంగులు పింఛన్‌నుంచి వృద్ధాప్య పింఛన్‌కు మార్చి నట్లు కూడా నోటీసులలో ఇవ్వడం జరిగింది. దీంతో రూ. 6000 పింఛన్ నుంచి రూ. 4000 పింఛన్‌కు మార్చి రెండువేల రూపాలయలు తమకు రాకుండా చేస్తున్నారని దివ్యాంగులు ఆరోపిస్తున్నారు. వారు కూడా ఎంపీడీవో కార్యాలయం చుట్టు తిరుగుతున్నారు.

కార్యాలయాల చుట్టు :

ప్రస్తుతం అధికారులు దివ్యాంగులకు ఇచ్చిన నోటీసులలో 40 శాతం కన్నా తక్కువ వికలాంగం ఉందని పింఛన్ నుతొలగిస్తున్నామంటు నోటీసులు అందజేశారు. దీంతో పింఛన్‌దారుల గుండేల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. గతంలో 80, 90, 70 శాతం ఉన్న వారికి కూడా ప్రస్తుతం ఇచ్చిన సర్టిఫికేట్‌లలో 40 శాతం కంటే తక్కువ ఉన్నట్లు ఉంది.

పుట్టుకతో ఉన్న వారికి కూడా..:

పుట్టకతో మరుగుజ్జులు, పోలీయో బాధితులకు, మూగ, చెవిటి, మానసిక వికలాంగులకు గతంతో 100, 80, 70 శాతం ఉన్నవారికి కూడా ప్రస్తుతం రీవెరిఫికేషన్‌లో 40 శాతం కంటే తక్కువకు పడిపోయింది. గత బుధవారం మండలంలోని దివ్యాంగులు దాదాపు 100 మంది ఎంపీడీవో కార్యాలయంను చేరుకొని ధర్నా చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీవో అనంతశయనను చుట్టుముట్టారు. 'మా పరిస్థితి ని చూడండి మాకు ఎందుకు నోటీసులు ఇచ్చారని వాగ్వాదానికి దిగారు. వైద్యులు ఇలాంటి సర్టిఫికేట్‌లు ఎందుకు జారీ చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు

● **పెద్దకడబూరు:** మండలంలో తోలగించిన 156 ఫించన్లను వెంటనేపునరుద్ధరించాలని సీపీఎం నాయకులు తిక్కన్న, పరమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఏంపీడీవో కార్యాలయంలో సీపీఎం నాయకులు ఏవో కౌసల్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన వారందరికీ ఫించన్లను ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు ఈరన్న, ఓబులేసు, దాస్ పాల్గొన్నారు.



అంబేడ్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్నదివ్యాంగులు

● **కౌతాళం:** మండలంలో ప్రభుత్వం దివ్యాంగులకు అకారణంగా నోటీసులు ఇచ్చి తొలగించిన ఫించన్లను వెంటనే పునరుద్దరించాలని సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య కోరారు. మండల కేంద్రమైన కౌతాళం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని దివ్యాంగులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అనంతరం దివ్యాంగులు చేపడుతున్న నిరసనకు మద్దతుగా సీపీఎం పార్టీ నాయకులు మద్దతు తెలుపుతూ వారితో కలిసి ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీ స్థానిక అంబేడ్కర్ సర్కిల్ వరకు చేపట్టి అక్కడ మానవహారం చేపట్టి రాస్తారోకో చేయడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది.

రూ.75 నుంచి పింఛన్



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు ఈడిగ నాగేంద్ర, హెచ్ కైరవాడి గ్రామం. వ్యక్తి కాళ్లు గమనించాలి. రెండు కాళ్లు చిన్న కట్టెపుల్లల్లా ఉంటాయి. కాళ్లమీద బలం వేసి ఏ పని చేయలేడు. కాస్త నడిస్తే కాళ్ల నొప్పులు వస్తాయి. ఈయన గతంలో రూ.75 ఇచ్చేటప్పటి నుంచి పింఛన్ వస్తోంది. గతంలో 70 శాతం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. అయితే ప్రస్తుతం 40 శాతం కంటే తక్కువగా ఉందని పింఛన్‌ను రద్దు చేస్తున్నట్లు నోటీసులు ఇచ్చారు. 'ఇదేమి న్యాయం నాకు ఉన్న వికలాంగత్వం వైద్యులకు కనిపించలేదా' అని ఆయన ప్రశ్నిస్తున్నాడు.

విచారణ కోసం ప్రభుత్వం సమయం ఇచ్చింది



నోటీసులు తీసుకున్న అందరికి తమ వైకల్యాన్ని సరిచూసుకునేందుకు ప్రభుత్వం మరో సారి అవకాశం కల్పించింది. బాధితులు తమకు సంబంధించిన సచివాలయంలో ఈకేవైసీని రెండు సార్లు చేయించుకొని వారి దగ్గర ఉన్న సర్టిఫికేట్స్ ను, ప్రభుత్వం ఇచ్చిన నోటీసును జత చేసి ఎంపీడీవో కార్యాలయంలో ఇవ్వాలి. లిస్టును తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాము. ఎవ్వరికి అన్యాయం జరగదు. అర్హత ఉన్నవారికి అందరికీ పింఛన్ వచ్చేలా చర్యలు తీసుకుంటాం.

అనంతశయన, ఇన్‌చార్జి ఎంపీడీవో, గోనెగండ్ల.

20 ఏళ్ల నుంచి పింఛన్..



ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పేరు బోయ ఓబులేసు. 60 ఏళ్లు పైగా ఉంటాయి. ఆయనది గోనెగండ్ల బీసీ కాలనీ. పుట్టకంతోనే మూగ, చెవుడు ఉంది. గత 20 ఏళ్లు నుంచి పింఛన్ వస్తోంది. గతంతో 61 శాతం వికలాంగత్వం ఉన్నట్లు సదరన్ సర్టిఫికెట్ ఉంది. అయితే రీవెరిఫికేషన్ లో 40 శాతం కంటే తక్కువ ఉన్నట్లు నోటీసు జారీ చేసి పింఛన్‌కు అనర్హులుగా ప్రకటించారు. దీంతో అతని పరిస్థితి అగమ్యగోచరంగా మారింది

28 శాతం చూపిస్తూ నోటీసులు



ఈ చిత్రంలో ఉన్న వ్యక్తి పేరు వీరేంద్ర. పెద్దనేలటూరుకు చెందిన ఆయన పుట్టుకతోనే విభిన్న ప్రతిభావంతుడు. గతంతో 100 శాతం మానసిక దివ్యాంగత్వం ఉన్నట్లు సర్టిఫికెట్ ఇచ్చారు. అయితే ప్రస్తుతం ఇచ్చిన నోటీసుల్లో 28 శాతం ఉంది. కావున నీకు పింఛన్ రద్దు చేస్తున్నామని నోటీసు ఇచ్చారు. దాదాపు 10 ఏళ్ల నుంచి పింఛన్ వస్తుంది. వీరేంద్ర జరిగి అన్యాయంపై ప్రశ్నించేందుకు వారి తల్లి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చింది.

మరుగుజ్జుతనం డాక్టర్‌కు కనిపించలేదా?



డాక్టర్‌ల కంటికి తన మరగుజ్జుతనం కనిపించలేదా? అని అల్వాల గ్రామానికి చెందిన నరసమ్మ ప్రశ్నిస్తున్నారు. ఆమెకు గత 15 ఏళ్లుగా పింఛన్ వస్తోంది. వారు ముగ్గురు అక్కచెల్లెళ్లు కాగా ఆమె అక్కలకు పెళ్లిళ్లు జరిగాయి. కానీ ఆమె మరుగుజ్జుతనం కారణంగా వివాహం కాలేదు. తన తల్లిదండ్రులు ముసలివారు కావడంతో ఆమెకు వచ్చే పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నారు. ఇప్పుడు 40 శాతం కంటే తక్కువ దివ్యాంగత్వం ఉన్నట్లు నోటీసు ఇచ్చి పింఛన్‌ను రద్దు చేయడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

సమస్యలు తీర్చడానికి ప్రభుత్వం సిద్ధం



అర్జీలను స్వీకరిస్తున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తీర్చడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని టీడీపీ నియోజకవర్గ ఇంచార్జి రాఘవేంద్ర రెడ్డి అన్నారు. శుక్రవారం మాధవరంలోని తన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, పెద్దకడుబూరు మండలాల నుంచి చాలా మంది అర్జీలు ఇచ్చేందుకు కార్యకర్తలు, ప్రజలు క్యూ కట్టారు. ప్రజలకు ఏ ఆపద వచ్చినా తనకు గాని తన సోదరులు రఘునాథ్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, తనయుడు రాకేష్‌రెడ్డి దృష్టికి తెచ్చిన వెంటనే పరిష్కరించి న్యాయం చేస్తామన్నారు. అర్హులైన దివ్యాంగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రజలకు ప్రతీరోజు అందుబాటులో ఉంటామని తెలిపారు. టీడీపీ నాయకులు గుర్నింటి భీమిరెడ్డి, గోపాల్, రామకృష్ణ, శివ, నర్సిరెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

పట్టణ ఎస్‌ఎఫ్‌ఐ కార్యవర్గం ఎన్నిక

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 20 (ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్, జిల్లా కార్యదర్శి ఆర్యన్ తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు, ప్రశ్నించేతత్వం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం ఎమ్మిగనూరు పట్టణ కమిటీను ప్రకటించారు. పట్టణ అధ్యక్షుడిగా ఇమ్రాన్, ప్రధాన కార్యదర్శిగా మధును ఎన్నుకున్నారు. సతీష్, గురుస్వామి పాల్గొన్నారు.

రీ సర్వేలో తప్పులను సరిచేసుకోవాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆయా గ్రామాలో జరిగిన రీ సర్వేలో భూముల విషయంలో ఏవైనా తప్పులు ఉంటే రైతులు సరిచేసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్యాభరద్వాజ్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని చెన్నాపురం గ్రామంలోని సచివాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు రీ సర్వే జరిగే సమయంలో భూముల దగ్గర ఉండాలన్నారు. రెవెన్యూ అధికారులకు హద్దులను సక్రమంగా చూపించుకోవాలన్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బందితో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ శేషఫణి, ఆర్ఐ హఫీజ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర కన్నడ సాహిత్య సమ్మేళనం

మంత్రాలయం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గురురాజాంగణ భవనంలో కన్నడ సాహితీ పరిషత్ మొదటిసారిగా ఏపీ, తెలంగాణ, గోవా, కర్నాటకలోని చిక్కమంగళూరు యూనిట్లచే అంతర్రాష్ట్ర కన్నడ సాహిత్య సమ్మేళనం తెలంగాణ, ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గుడుగింటి విఠల్‌జోషి, అంజన్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్ణాటకకు చెందిన అనేక మంది దేశ విదేశాల్లో దేశానికి గుర్తింపు తెస్తున్నారని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు అన్నారు. శుక్రవారం స్థానిక ముఖ్య అతిథిలుగా పాల్గొన్న పీఠాధిపతి దేశ జెండాలు ఆవిష్కరించి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మండపాల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

మంత్రాలయం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27వ తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, గణేశ్ మండపాలు ఏర్పాటు చేసుకునే నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని మంత్రాలయం సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్ తెలిపారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మంత్రాలయం, మాధవరం పోలీస్ స్టేషన్ పరిధిలో వాడవాడలా వెలిసే గణనాథుల ఏర్పాటుకు ప్రభుత్వం పోలీసులు సూచించిన నిబంధనల మేరకు గణేష్ మండపాల యువజన సంఘాలు, సంబంధిత ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా నిర్వాహకులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు.

నందవరం: గ్రామాల్లో వినాయకుడి ప్రతిష్ఠకు పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తప్పని సరిగా తీసుకోవాలని ఎస్ఐ కేశవ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ వినాయకుడి ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు కార్యకర్తలు, కమిటీ సభ్యులు అలర్ట్‌గా ఉండాలన్నారు. ఇతర మతస్థుల మనోబావాలు కించ పరిచే విధంగా రెచ్చగొట్టే నినాదాలు చేయరాదన్నారు పోలీసులను కూడా గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

మద్యం తాగి వాహనం నడిపితే కేసు



తనిఖీలు చేస్తున్న ఎస్ఐ

మంత్రాలయం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం హైవే రోడ్లలో మద్యం సేవించి వాహనం నడిపితే కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తామని మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ అన్నారు. శుక్రవారం మండలంలోని చెట్నపల్లి సమీపంలో జాతీయ రహదారి-167 మీద వాహనాలు నడుపుతున్న డ్రైవర్లకు డ్రంకెన్ డ్రైవ్‌టెస్ట్ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

చెక్క రథంపై ప్రహ్లాదరాయలు



చెక్క రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): శ్రీమఠంలో ఉత్సవ మూర్తి ప్రహ్లాదరాయలు చెక్క రథంపై విహరించారు. శక్రవారం శావణ చతుర్ధశి శుభ దినంను పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే పండితులు, అర్చకులు రాఘవేంద్రస్వామి మూల బృందావనానికి విశేష పూజలు నిర్వహించారు. పీఠాధిపతి పూర్ణబోధపూజ మందిరంలో సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది.

మంచాలమ్మకు విశేషాభిషేకం: రాఘవేంద్ర స్వామి మఠంలో వెలసిన గ్రామదేవత మంచాలమ్మకు మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు చేతులమీదుగా సుగంధ ద్రవ్యాలతో విశేషాభిషేకం నిర్వహించారు. శక్రవారం శ్రావణ మాసం ముగింపు శుభదినం ను పురష్కరించుకొని మఠం పీఠాధిపతి ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు

అన్నదానానికి విరాళాలు

కౌతాళం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి):ప్రముఖ పుణ్యక్షేత్రం ఉరుకుంద ఈరన్న స్వామి వారికి భక్తులు శ్రావణ మాసంలో భాగంగా వారం దేవాలయంలో చేపడుతున్న శాశ్వత అన్నదాన పథకానికి ఇద్దరు భక్తులు చెరో లక్ష రూపాయల చొప్పున రూ.2లక్షలను విరాళంగా అందజేసినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ,ఈఓ వాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ దేవాలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి డోన్ వాస్తవ్యులు వెంకట హర్షవర్ధన్ రెడ్డి, శృతి దంపతులు, వెంకట తరుణ్ రెడ్డి, రచన దంపతులు వారి కుటుంబ సభ్యులు చెరో రూ.1,00,116ల ప్రకారం రూ.2,00,332 నగదును, ఆలయంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి ఈ నగదును విరాళంగా ఆలయ కార్యాలయం నందు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది కుమార్, అర్చకులు శివన్న స్వామి ఉన్నారు.

ప్రభుత్వానికి నివేదిక పంపుతాం



వర్షానికి కుళ్లిన ఉల్లిపంటను పరిశీలిస్తున్న ఉద్యానవన శాఖ అధికారిశ్రీవాణి

గోనెగండ్ల, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్ ఇటీవల కురిసిన వర్షాల కారణంగా ఉల్లి పంట దెబ్బతిన్న, కుళ్లిపోయిన రైతుల నివేదిక తయారు చేసిన పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని ఎమ్మిగనూరు ఉద్యానవన శాఖ అధికారిణి శ్రీవాణి అన్నారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కన్నీళ్లు పెట్టిస్తున్న ఉల్లి' అనే శీర్షిక కథనం ప్రచురితమైంది. ఇందుకు ఉద్యానవన శాఖ అధికారులు స్పందించారు. అందులో బాగంగా శుక్రవారం గోనెగండ్ల కు చెందిన నల్లారెడ్డి అనే రైతు పొలంలోని ఉల్లి పంటను పరిశీలించారు. ఇటీవల కురిసిన వర్షం కారణంగా ఉల్లి పంట కుళ్లిపోయిందని ఆయన ఆధికారికి తెలిపారు. తాను రెండు ఎకరాల్లో ఉల్లి పంటను సాగు చేసినట్లు పెట్టు బడి కింద దాదాపు రూ. 2లక్షలు వచ్చిందని దిగుబడి కూడా చాల తక్కువ ఉందని ఎకరానికి రెండు వందల బస్తాలు దిగుబడి రావాల్సి ఉండగా కేవలం 60 బస్తాలు మాత్రమే వచ్చిందని తెలిపారు. దీంతో ఉద్యాన వన శాఖ అధికారిణి శ్రీవాణి స్పందించి పంటలోని మెలుకువలను తెలిపారు. అలాగే ఉల్లి పంట నష్టపోయిన రైతులుకు పరిహారం అందేవిధంగా ప్రభుత్వానికి నివేదిక తయారు చేసి పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫకీబాషా, రైతులు పాల్గొన్నారు.

హమాలీలకు లైసెన్స్‌లు అందించాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో పనిచేస్తున్న హమాలీలకు లైసెన్స్‌లు, పనిముట్లు అందజేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బాలరాజు డిమాండు చేశారు. ఈ సందర్బంగా శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కమీషన్ ఏజెంట్ల దగ్గర పనిచేస్తున్న హమాలీలందరికి లైసెన్స్‌లు, పనిముట్లను యాజమాన్యం అందిచాలన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి సత్యన్న, బాబు, చిన్న హనుమప్ప, ఉపేంద్ర తదితరులు పాల్గొన్నారు.

క్లూస్ టీమ్ పరిశీలన

కోసిగి ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని 9వ వార్డు దుర్గానగర్‌లో రైల్వే ఉద్యోగి తుప్పలభీమయ్య, ఈరమ్మ దంపతుల ఇంట్లో గురువారం ఐదు తులాల బంగారం, 70 తులాల వెండి, రూ.10వేల నగదు చోరీకి గురైనట్లు బాధితుడు రైల్వే ఉద్యోగి భీమయ్య ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈమేరకు ఎస్ఐ హనుమంతరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా శుక్రవారం కర్నూలు నుంచి వచ్చిన క్లూస్ టీమ్ బాధితుడి ఇంట్లో వేలిముద్రలు సేకరించారు. త్వరలో దొంగలను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

ఆన్ కాల్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి

ఎమ్మిగనూరు రూరల్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న ఆన్‌కాల్ డ్రైవర్లకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆన్‌కాల్ డ్రైవర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు రంగన్న, సలహాదారు ఎర్రిస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు సోమేష్, కిశోర్, ఏవీరెడ్డి, వలి, ఎస్ జె బాషా, రావు, సైపుల్లా పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై దృష్టి పెట్టాలి



మొక్కలు పంపిణీ చేస్తున్న జడ్పీ మాజీ వైస్ చైర్‌పర్సన్

నందవరం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటలపై రైతులు ఎక్కువగా దృష్టి పెట్టాలని టీడీపీ నాయకురాలు మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పుష్పావతి రైతులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం మండలంలోని హలహర్వి గ్రామంలో ఏపీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఆదేశాల తో ఎంపీడీవో పుల్లయ్య, ఈవోపీఆర్డీ సందీప్ 5 గ్రామాలకు 16 ఎకరాలకు గాను 12 మంది రైతులకు మొత్తం 2641 పండ్ల మొక్కలను రైతులకు అందజేశారు. అందులో డ్రాగన్‌ఫ్రూట్, కొబ్బరి, చీని, దానిమ్మ, అల్లనేరేడు, మామిడి మొక్కలను రైతులకు ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ కన్వీనర్ కాశీంవలీ, ఐ టీడీపీ తాలుకా అధ్యక్షుడు వీరేష్ , జనసేన మండల అధ్యక్షుడు యల్లప్ప, పేట సామేలు, గాలెప్ప, బజారి, పొణకలదిన్నె లక్ష్మీకాంత్ పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూ డిపో గౌరవ అధ్యక్షుడిగా తిక్కారెడ్డి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ మజ్దూర్ యూనియన్ డిపో గౌరవఅధ్యక్షుడిగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డిని నియమించినట్లు ఎన్ఎంయూ అధ్యక్షుడు రఫీక్, కార్యదర్శి ముస్తాక్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి తన స్వగృహంలో మాట్లాడుతూ తనను డిపో గౌరవ అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ఎన్ఎంయూ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గౌరవఅధ్యక్షుడు తిక్కారెడ్డికి ఎన్ఎంయూ నాయకులు డిపోలోని సమస్యలు వివరించారు.

చేనేతలను ఆదుకోవాలి

ఎమ్మిగనూరు టౌన్, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు పట్టణంలో అకాల వర్షాలు వలన నష్టపోయిన చేనేత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని వైసీపీ నాయకులు నజీర్, శివప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం చేనేతల ఇళ్లకు వెళ్ళి వారి పరిస్థితి చూసి మాట్లాడుతూ అకాల వర్షాల కారణంగా చేనేతలు మగ్గాల ఏర్పాటు చేసిన గుంతలలో వర్షపు నీరు చేరి మగ్గాలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం చేనేతలకు తక్షణమే ఆదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో నాగేంద్ర, రఘువీర, గిరి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలు కల్పిస్తాం

మంత్రాలయం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా రుణాలు, పొదుపు మహిళలకు రుణాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తామని కర్నూలు జిల్లా ఎల్‌డీఎం మేనేజర్ రంగాచార్యులు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమావేశ భవనంలో డీఆర్‌డీఏ అధికారి అబ్దుల్ రెహమాన్ ఆధ్వర్యంలో మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో ఉన్న దాదాపు 20 బ్యాంకు అధికారులు, వెలుగు ఏపీఎంలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వం సబ్సిడీ కింద అందించే రుణాలు, పొదుపు మహిళలకు అందించే బ్యాంకు లింకేజీలకు అర్హులైన వారందరికీ అందించేందుకు బ్యాంకు అధికారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. బ్యాంకులో ఏమైనా ఇబ్బందులు, సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. ఈ సమావేశంలో కెనరా బ్యాంకు, ఎస్‌బీఐ, ఏపీజీబీ, బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్లు నాగార్జున, రాజశేఖర్, జయకృష్ణ, మురళీకృష్ణ, నాలుగు మండలాల ఏపీఎంలు రాజశేఖర్, నరసమ్మ, శ్రీనివాసులు, వెంకటస్వామి, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

గ్రామాల్లో అధికారుల పర్యటన



రైతులతో మాట్లాడుతున్న అధికారులు

కోసిగి, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి):మండల పరిధిలోని కందుకూరు, కడిదొడ్డి గ్రామాల్లో వరద నీటితో మునిగిపోయిన వరి పంటలను మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్ రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. శుక్రవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'కడిదొడ్డి రైతుల కన్నీటి రోదన.. నీట మునిగిన 120 ఎకరాల వరి పైర్లు.. ఆవేదనలో అన్నదాతలు' ప్రచురితమైన కథనానికి మండల పరిధిలోని లక్ష్మీనగర్ క్యాంప్, కందుకూరు, కడిదొడ్డి గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను మండల వ్యవసాయాధికారి వరప్రసాద్, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి వర ప్రసాద్ మాట్లాడుతూ దాదాపు 50 ఎకరాల్లో వరి పంట నీట మునిగిందని, అయితే.. వరి పంట నీట మునిగినా 5 నుంచి 7 రోజుల వరకు పట్టుకుంటుందని, నీరు బయటకు వెళ్లిన తర్వాత ఎకరాకు 200 మి.లీల ప్రోపి కొనోజోల్, ఎకరాకు 400 మి.లీల హెక్సా కొనజోల్, 100 మీ.లీ. వాలిడామైసిన్ మందులను ఆంధ్రజ్యోతి కథనం మేరకు నీట మునిగిన పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదికలు పంపుతున్నట్లు ఏవో వరప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో భాలస్వామి, వీఏఏ మధుసూదన్‌గౌడు, రైతులు ఉన్నారు.